

మహామాయ-౬
వజ్రాయుధం
డిటెక్టివ్ & మిస్టరీ నవల
8
అణాలు
రచన
కనకమేడల

మహామాయ-6

# వజ్రాయుధం

రచన : కనకమేడల

ప్రచురణ : విజ్ఞాన సాహితి
టి'నగర్ : : మద్రాసు-17

ప్రథమ ముద్రణ
అక్టోబరు 1956

ఏజంట్లకు,

పుస్తకాలను ప్రకటించిన తేదీలకే వెలువరించమని కోరికూడా, మేం శ్రమపడి సకాలంలో పుస్తకాలను వెలువరించినా కొందరు ఏజెంట్లు డబ్బు పంపడం ఆలస్యం చేసి ప్రతులు ఆలస్యంగా తెప్పించుకుంటున్నారు. నెలకు రెండు మూడు పుస్తకాలు ప్రచురిస్తున్న మేం ఏజెంట్లు ఆలస్యంగా డబ్బు పంపితే సకాలంలో పుస్తకాలు అందించడం కష్టం. ఈ సంగతిని గమనించి ప్రకటించిన తేదీలలోపునే డబ్బు తప్పక పంపాలి. ఒక నెలలో వెలువడే అన్ని పుస్తకాలకు ఒక్కసారే డబ్బు పంపడం మంచిది. లేదా సమర్థులైన ఏజెంట్లు డిపాజిట్ కట్టి నెలాఖరున మా బిల్లు ప్రకారం డబ్బు చెల్లిస్తూ ఉండవచ్చు.

వెల
0-8-0

ఆశీవందనాలతో,
డైరెక్టర్.

ముద్రణ: శ్రీ నిలయం
మద్రాసు-17

కిరణ్మయిని కాపాడడానికి వెళ్లిన మంత్రవాది, ప్రతాప్ ఒక విచిత్ర భవనంలో ప్రవేశించి వెనక్కి తిరిగి రాలేదు. రాయదుర్గాధిపతి, త్రిపుర మాటలకు లొంగిపోయి నరేంద్ర మహారాజాదులను మోసగించి బంధించాడు. యమదూత సహాయంతో వాళ్లు ఖైదునుండి విముక్తి పొంది తిరిగి రాయదుర్గాన్ని స్వాధీనం చేసుకుంటారు. తర్వాత—

## 1

ఆ అడవిలో కాకులు కూడా దూరడానికి వీల్లేనంత దట్టంగా పెరిగాయి చెట్లు. ఆ చెట్లమధ్యగా ఒక పాడుపడిన భూగృహం ఉంది. ప్రహరీగోడ చాలవరకు దట్టంగానే ఉంది కాని లోపలి ఇంటిగోడలు మాత్రం కొన్నిచోట్ల పడిపోయాయి. ప్రహరీగోడలకు ఆ ఇంటికీ మధ్యలో కూడా కొన్ని చెట్లు ఎత్తుగా మొల్చి ఉన్నాయి.

ఆ భూగృహంలోని ఒక గదిలో లావణ్య పడి ఉంది. నిద్రాదేవత ఒడిలోంచి అప్పుడే మేలుకొన్నట్టుగా కళ్లు తెరచి కంగారుగా అటూ ఇటూ చూసింది.

ఆ భూగృహం ఆమెకు చాలా వింతగా కనిపించింది. ఇదివరకెన్నడూ ఈ ఇంటిని ఆమెచూసి ఉండలేదు. మళ్లీ ఓ సారి కళ్లు మూసుకుని ఆమె నెమ్మదిగా ప్రశాంతంగా ఆలోచించింది. ఆమె మనఃఫలకం మీద గడచిన సంఘటనలన్నీ తోలుబొమ్మలాటలా మెదిలాయి.

కాళి చెప్పిన ప్రకారం తాము చిత్రగృహం వెళ్లేదారిలో ఎదురుపడ్డ యువతిని ముందు కూర్చోపెట్టుకుని ఆమె చూపిన దారిని తాను బయలుదేరింది. కాని ఎక్కువదూరం వెళ్లక ముందే ఒక దొంగలముఠా తనను అడ్డగించింది. ఆ ముఠా ఎవరిదో కాదు. తన తండ్రి శూరసేనుడిది.

అతని ఆజ్ఞమీద దొంగలముఠా తామిద్దరినీ పట్టుకుబంధించింది. కిరణ్మయిని తండ్రి చేతులలోనుండి విడిపించినందుకు అతనికి తనమీద కోపంగా ఉంది. తనకు స్పృహ తప్పేట్టు చేసి ఎక్కడికో తీసుకుపోయారు. తిరిగి స్పృహ వచ్చేసరికి తానొక కొండగుహలో బంధింపబడి ఉంది. ఆ యువతి ఏమైందీ మాత్రం తెలియలేదు. ఆ తర్వాత తన తండ్రి వచ్చి తనమీద కోపంతో కేకలువేసి వెళ్లాడు. ఇలా కొన్నిరోజులు గడచింది. తానా కొండగుహలో అన్నిరోజులూ బంధింపబడే ఉంది. నిద్రాహారాలు కూడా సరిగాలేవు. వచ్చి పలకరించిన వాళ్లే కూడా ఎవరూ లేరు.

తర్వాత ఓ రోజు ఎవరో శత్రువులు కాబోలు ఆ కొండ గుహలమీదకు దండయాత్రచేసి దొంగల ముఠాను హతమార్చినట్టున్నారు. బయట పెద్ద యుద్ధం జరుగుతున్న కోలాహలం తనకు వినిపించింది. తన తండ్రి ఏమైందీ తనకు తెలియలేదు.

ఎవరో తన గుహలోకి వచ్చారు. మత్తుమందు వాసనచూపి స్పృహలేకుండా చేశారు. తిరిగి తనకు స్పృహ వచ్చేసరికి ఇక్కడ ఈ స్థితిలో ఉంది. కాని ఇప్పుడు తన ఒంటిమీద కట్లులేవు. ఒంట్లో నిస్సత్తువగా మాత్రం ఉంది.

లావణ్యా కళ్లు తెరచింది. తిరిగి ఓసారి అటూ ఇటూ చూసింది. ఈ భవనం ఎవరిదో, ఇక్కడెవరున్నారో ఆమెకు తెలుసుకోవాలనిపించింది. గాఢాంధకారం కాకపోయినా లోపల చీకటిగానే ఉంది. ఆ గదికి ఒకే ఒక ద్వారం ఉంది. కొంచెం ఎత్తుగా ఒక కిటికీ మాత్రం ఉంది. ఆ కిటికీలోంచే కొద్ది వెల్తురు లోపలికి ప్రసరిస్తోంది. మరి అవతల ఏముందో?

లావణ్యా నెమ్మదిగా లేచి తలుపుదగ్గరకు వెళ్లింది. దర్వాజా నెట్టడానికి ప్రయత్నించింది కాని అది తెరచుకోలేదు. అవతలి వైపున బంధింపబడి ఉన్నట్టుంది. ఆమె నిరాశగా వెనక్కి తిరిగి వచ్చింది. నేలమీద కుప్పలా కూలిపోయింది. ఒకప్రక్క ఆకలి దహించుకుపోతోంది. రెండోప్రక్క బాగా దాహం వేస్తోంది.

ఉన్నట్టుండి ఆమెకు ఎక్కడినించో ఎవరో మూలుగుతున్న శబ్దం వినిపించసాగింది. క్రమక్రమంగా ఆ ధ్వని ఎక్కువ కాసాగింది. కాని ఆ మూల్గుడు ఎటునించి వినిపిస్తోందో మాత్రం లావణ్యా ముందు గ్రహించలేకపోయింది. తర్వాత గోడకు ఉన్న కిటికీలోంచి ఆ శబ్దం వినవస్తున్నట్టు ఆమెకు తెలిసింది.

తనలాగే ఎవరైనా అవతలి ప్రక్కగదిలో బంధింపబడి ఉండాలి అనుకున్నది లావణ్యా. కాని తమనిలా బంధించి ఉంచాల్సిన అవసరం ఎవరికేర్పడిందో ఆమె ఎంత ఆలోచించినా తెలియనేలేదు.

క్రమంగా హెచ్చుస్థాయినందుకుంటున్న ఆ శబ్దం విని లావణ్య ఉండలేకపోయింది. ఎలాగైనా కిటికీదాకా ప్రాకి అవతల ఎవరుందీ చూడాలని నిర్ణయించుకుంది.

ఇదే సమయంలో బయట ఎవరో మాట్లాడుతున్న చప్పుడు వినిపించింది. గొంతుకలనుబట్టి అవి మగవాళ్ల స్వరాలని ఆమె గ్రహించింది. దర్వాజా దగ్గరకువెళ్లి చెవులు నిక్కించి వినసాగింది. అన్నిమాటలు స్పష్టంగా తెలియకపోయినా కొన్ని కొన్ని మాటలు అప్పుడప్పుడూ వినిపించసాగాయి.

కాసేపటికి వాళ్లందరూ కలిసి ఏదో ఒక పెట్టెలాంటి వస్తువును నేలమీద ఈడుస్తున్నట్టు వినిపించనారంభించింది.

"మూడోగదిలో ఉంచుదాం." అందులో ఒకతను అన్నాడు.

"వద్దు. క్రింద గదిలో ఉంచితేనే బాగుంటుంది. ఈ గదులలోకి ఎవరైనా వస్తే రావచ్చు," అన్నాడు రెండో అతను.

క్రమంగా పెట్టె లాగుతున్న చప్పుడు అంతమైంది. మళ్లీ నిశ్శబ్దం ఆవరించింది బయట. కాని గదిలోకి మూలుగుడు వినిపిస్తోంది. లావణ్య దర్వాజా దగ్గరినించి వెనక్కి నడిచింది. ఇదంతా ఆమెకు కలలా అనిపించసాగింది. ఆ పెట్టెలో ఉన్న దేమిటో, దానిని లాక్కువచ్చిన వాళ్లెవరో, దాన్నిక్కడ ఎందుకు దాస్తున్నారో ఆమెకు తెలియకుండా ఉంది.

గోడ అడుగుభాగంలో ఉన్న చిన్న మెట్టులాంటిదాని మీద కాలు వేసి లావణ్య ఒకచేత్తో కిటికీఊచనొకదానిని పట్టుకోగలిగింది ఎంతో ప్రయాసమీద. చివరికి నెమ్మదిగా

రెండో చేత్తో కూడా మరో ఊచను పట్టుకుని ప్రాకడానికి ప్రయత్నించచనారంభించింది.

ఆమె ప్రయత్నం ఫలించింది. ఆమె రెండో గదిలోకి తలెత్తి చూసింది. ఆ గదిలో కూడా అంత వెల్తురు లేదు. కొంత చీకటిగానే ఉంది.

గదిలో ఓ మూలగా ఒక యువతి పడి ఉంది. ఆమే మూలుగుతున్నది. చీర అడ్డురావడంవల్ల మొఖం సరిగా కనిపించడంలేదు.

ఇంతలో లావణ్య కాలిపట్టు తప్పిపోవడంవల్ల క్రిందకు జారింది. మళ్ళీ నెమ్మదిగా పైకి ఎగబ్రాకింది. ఈసారి ఆ యువతి లేచి కూర్చుని ఉంది. లావణ్య ఆమె మొఖంకేసి చూసింది.

"కిరణ్మయి!" లావణ్య ఆశ్చర్యంగా అరచింది.

ఆ అరపు విన్న కిరణ్మయి కూడా కిటికీ వంక చూసింది. లావణ్యను గుర్తుపట్టగలిగింది. తనను విడిపించడానికి వచ్చిందేమో అనుకుని ధైర్యం కూడదీసుకుంది.

"లావణ్యా!" కిరణ్మయి హీనస్వరంలో అంది.

"మీరు కూడా ఇక్కడే బంధింపబడి ఉన్నారన్నమాట. మీ రేస్థితిలో ఉన్నారో నేనూ అదేస్థితిలో ఉన్నా. కాకపోతే కొంచెం నయం," లావణ్య అంది.

కిరణ్మయి ఆశ నిరాశ ఐంది. లావణ్య కూడా అవతలి గదిలో బంధింపబడే ఉందన్నమాట!

తన సంగతి ఎలా ఉన్నా కిరణ్మయికి ప్రతాప్ సంగతులు తెలుసుకోవాలన్న ఆతురత కలిగింది! డేరాలోంచి మాయమైం

తర్వాత అతని విషయాలు కిరణ్మయికేం తెలియలేదు. లావణ్య కేమైనా తెలిస్తే తెలిసి ఉండవచ్చుననుకుందామె.

"ప్రతాప్‌గారి సంగతులేమైనా నీకు తెలిశాయా?" కిరణ్మయి తిరిగి మందస్వరంలో అడిగింది.

"నాకేం తెలియదు. ఆయనను విడిపించడానికనే బయలుదేరి నేనిక్కడ చిక్కుకున్నాను."

"కాలి ఏమైంది?"

"మిమ్మల్ని విడిపించడానికని చిత్రగృహంలోకి వెళ్ళి ఉండాలి."

"ఈ కష్టాలకంతంటూ లేదనుకుంటా," కిరణ్మయి చివరికి నిరాశగా, బాధగా అంది.

ఇంతలో మళ్ళీ దర్వాజా దగ్గర ఏదో చప్పుడు వినిపించసాగింది. లావణ్య కిటికీదగ్గరనుంచి క్రిందకి దిగి తలుపుదగ్గరకు వెళ్ళింది. చప్పుడునుబట్టి ఎవరో తాను ఉన్న గది తాళం తెరవడానికి ప్రయత్నిస్తున్నారని ఆమె గ్రహించింది. ఎందుకైనా మంచిదని ఒక ప్రక్కకు తప్పుకుని ఆమె తలుపుకేసి చూడసాగింది.

మరుక్షణంలో అవతలిప్రక్క కోలాహలం చెలరేగింది. ఎవరో యుద్ధం చేస్తున్నట్టు కత్తులచప్పుడు వినిపించసాగింది. ఎవరో పారిపోతున్న ధ్వని వినిపించింది. మరొకరు కెవ్వుమని కేకపెట్టారు.

ఇదంతా వింటూంటే లావణ్య ఎంత ధైర్యవంతురాలైనా భయపడసాగింది. ఆత్మరక్షణార్థం తన దగ్గర చిన్నకత్తి కూడా లేదు.

అకస్మాత్తుగా తలుపులు తెరచుకున్నాయి. లావణ్య ఒక ప్రక్కకు ఒదిగి నిలబడింది. కాని లోపలికి అడుగుపెట్టిన కాళిని చూడగానే అంతులేని ఆశ్చర్యంతో 'కాళీ!' అని అరచింది. ఈ సమయంలో కాళి ఇక్కడ ప్రత్యక్షమౌతుందని ఆమె కలలో కూడా అనుకోలేదు.

కాళి కూడా లావణ్యను అక్కడ ఆ స్థితిలో చూడగానే చాలా విస్తుపోయింది. తాను ప్రతాప్‌ను కాపాడడం కోసం పంపించిన లావణ్య ఇక్కడ ఎందుకుందో ఆమెకు అర్థం కాలేదు.

రెండు నిమిషాలవరకు అంతులేని ఆశ్చర్యాలలో మునిగిపోయి ఎవరూ మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా కాళి అంది.

'బయట నేపాళి నిలబడి ఉన్నాడు.'

లావణ్య రెండడుగులు బయటికి వేసింది.

'ఇంతకంటే నీకు ఆశ్చర్యకరమైన విషయం మరొకటి చెబుతాను. ఐతే ముందు మీరిద్దరూ ఇక్కడికి ఎలా వచ్చారో చెప్పాలి,' లావణ్య అంది.

'విశేషమేమీ లేదు. రాయదుర్గాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్న అనంతరం నరేంద్రమహారాజుగారు, మహామంత్రి, జయంత్, మేం ప్రతాప్‌ను విడిపించడానికని బయలుదేరాం. గుర్రాలమీద వెళ్తుండగా కొందరు భటులు ఒక పెట్టెను మోసుకువస్తూ కనిపించారు. ఆ పెట్టెలో ఏముందో చూడాలని మాకు కుతూహలం కలిగింది. మహారాజాదులు కొంచెం దూరంలో విశ్రమిస్తున్నారు. మేమిద్దరం వాళ్లను రహస్యంగా అనుసరించాం. చివరికి వాళ్లా పెట్టెను తీసుకుని ఈ భవనం

లోకి వచ్చారు. మేం చాటుగా ఉండి వాళ్లిక్కడ ఏం చేస్తు న్నదీ చూశాం. ఆ పెట్టెను ఒకచోట దాచారు. తర్వాత అందులో కొందరు ఇక్కడికి వచ్చి ఈ గది తాళం తీశారు. తలుపు తెరచేలోగా మేం వాళ్లమీదకు దూకాం. కొందరు పారిపోయారు,' కాళి వివరంగా సమాధాన మిచ్చింది.

లావణ్య కూడా తాను ప్రతాప్ కోసం బయలుదేరింది మొదలు ఇప్పటివరకు జరిగిన సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెప్పి వినిపించింది.

కాళి కాసేపు మౌనంగా ఉండిపోయింది. ఇంతలో లావణ్య తిరిగి అన్నది.

'మరో సంగతి చెప్పడం మర్చిపోయాను. నేనే కాదు. కిరణ్మయి కూడా ఇక్కడే ఉంది. ఈ ప్రక్కగదిలో ఉంది.'

ఆ మాట వినగానే కాళిని ఆనందాశ్చర్యాలు తిరిగి ఆవ రించాయి. గబగబా ఆ గది ముందుకు వెళ్లింది. కాని దానికి తాళం వేయబడి ఉంది. తాళపుచెవి లభించడం కష్టం. దానిని పగలగొట్టడం అసాధ్యం కూడా. కాళి ఏమీతోచక అటూ ఇటూ చూడసాగింది.

'నువ్వు కిరణ్మయిని చూడాలంటే నేనోదారి చూపిస్తాను,' అన్నది లావణ్య.

'ఎలా ?' అని అడిగింది ఆతురతగా కాళి.

లావణ్య తాను కిరణ్మయిని చూసిన పద్ధతిని ఆమెకు వివరిం చింది. కాళి కూడా ఆ కిటికీ దగ్గరకు వెళ్ళింది. లావణ్యలాగే ఎలాగో తంటాలుపడి కిటికీదాకా ప్రాకి కిరణ్మయిని చూడ గలిగింది.

కాళిని కూడా చూడగానే కిరణ్మయికి ఎంతో ఆనందం కలిగింది. నిరాశ చెందిన ఆమె మనస్సులో ఆశ తిరిగి అంకురించింది. ప్రతాప్ విషయాలు తెలుస్తాయేమోనని ఉబలాట పడింది. కాని కాళి అక్కడ ఎక్కువసేపు నిలబడలేక పోయింది. ముందు ఆమెను ఆ గదిలోంచి విడిపించే ఉపాయం చూడాలి. తర్వాత మిగిలిన సంగతులు మాట్లాడుకోవచ్చు. ఆ సంగతి కిరణ్మయికి చెప్పి కాళి కిటికీ దగ్గరినుండి దిగి వచ్చింది.

'మనం వెదకడానికి బయలుదేరింది ఒకరొకరిని; కాని దొరికింది మరొకరు. ఐనా ఇక్కడ ఒకరిద్దరు ఉండి ఈ పనిని పూర్తిచెయ్యాల్సి ఉంటుంది,' అన్నది కాళి నేపాళితో.

'సరే. ఆ సంగతి ఆలోచిద్దాం. ముందు ఆ పెట్టె సంగతేమిటో తెలుసుకుని తర్వాత మహారాజుగారికి జరిగిన విషయాలన్నీ తెలియచేద్దాం,' అన్నాడు నేపాళి.

ముగ్గురూ అక్కడినించి ఆ భటులు పెట్టెదాచిన చోటికి బయలుదేరారు. ఆ గదిలో ఒక భటుడు కాపలా ఉంచబడ్డాడు. వీళ్లందరినీ చూడగానే అతను భయపడిపోయాడు. వాళ్లవంక కంగారుగా చూస్తూ నిలబడ్డాడు.

నేపాళి గది నాలుగువైపులా పరిశీలనగా చూశాడు. ఆ గదిలోనే ఆ పెట్టెను వాళ్లు దాస్తుండగా నేపాళి, కాళి చూశారు. కాని ఎక్కడ దాచిందీ వాళ్లు గమనించలేదు. ఇప్పుడు గదిలో వాళ్లకా పెట్టె కనిపించలేదు. ఆ గదిలో వేరే సామాను కూడా ఏదీలేదు. చుట్టూ బలమైన నాలుగు గోడలు ఉన్నాయి. మధ్యగా ఒక పెద్ద రాతిసింహపు తల ఉంది.

'ఆ పెట్టెను ఎక్కడ దాచారు?' నేపాళి కోపంగా ఆ భటుడివంక చూస్తూ అడిగాడు. కాని అతను జవాబివ్వలేదు. తప్పించుకుపారిపోవడానికి మార్గమేమిటా అని ఆలోచించసాగాడు.

నేపాళి తన ఒరలోంచి కత్తిని బయటికి లాగాడు. 'ఆ పెట్టెని ఎక్కడ దాచింది చెబుతావా లేక ప్రాణాలు తియ్యమన్నావా?' అతను గర్జించాడు. ఆ భటుడు భయంతో వణకిపోయాడు. నెమ్మదిగా చూపుడు వ్రేలితో రాతిసింహం వంక చూపించాడు.

నేపాళి సింహం తలదగ్గరకు వెళ్లాడు. కాని పెట్టె అక్కడ ఎక్కడ ఉందో అతనికి తెలియలేదు. మళ్ళీ ఆ భటుడి వంక కోపంగా చూశాడు.

'ఆ సింహపు తలను అక్కడినించి తొలగించండి,' అన్నాడు వణకుతూ ఆ భటుడు.

నేపాళి ఆ సింహపు తలను ఒంటరిగా కదిలించడానికి ప్రయత్నించాడు కాని అతనివల్ల కాలేదు. చివరికి కాళి, లావణ్యా అతనికి చేయూతనిచ్చారు. సింహపు తలను అక్కడినించి ప్రక్కకు నెట్టారు.

దాని క్రింద పెద్ద సొరంగం ఉంది. నేపాళి ఆశ్చర్యంగా ఆ ప్రక్కకు చూశాడు. కాళి, లావణ్యా కూడా అటు చూశారు నేపాళి వెంటనే వెనక్కి తిరిగాడు. కాని ఆ భటుడు అక్కడ లేడు. ముగ్గురూ సొరంగం వంక ఆశ్చర్యంగా చూస్తున్న సమయంలో అతను పారిపోయి ఉంటాడు.

నేపాళి వెంటనే అక్కడినించి బయటికివచ్చి అటూ ఇటూ చూశాడు కాని అతను కనిపించలేదు. మళ్ళీ వెనక్కి వచ్చాడు. సొరంగంలోని మెట్లమీదుగా క్రిందికి దిగ సాగాడు. కాళి, లావణ్య ఆ గదిలో అలాగే నిలబడి ఉన్నారు.

నేపాళి కొంచెం దూరం వెళ్ళగానే ఒక గది కనిపించింది. దాని తలుపు తెరచే ఉంది. ఆ గదిలోకి అస్పష్టంగా కాంతి ప్రసరిస్తోంది. నేపాళి గదిలో ప్రవేశించాడు. ఓ ప్రక్కగా అతనికి పెట్టె కనిపించింది. ఆ పెట్టెను తీసుకుని నేపాళి వెనక్కి తిరిగాడు. ఎంతో కష్టంమీద కాళి లావణ్య ఉన్నచోటికి వచ్చాడు.

ఆ ఇద్దరూ ఆతురతగా నేపాళి వంక, పెట్టె వంక చూడ సాగారు. నేపాళి పెట్టెను ఒకప్రక్క దించి దానికి ఉన్న చిన్న తాళాన్ని పగలగొట్టాడు. నెమ్మదిగా పెట్టె తెరచాడు. అంతే! నేపాళి ఆశ్చర్యంగా వెనక్కి వాలాడు. కాళి, లావణ్య కూడా కంగారుగా పెట్టెదగ్గర చతికిలబడ్డారు.

ఆ పెట్టెలో ఉన్నది ప్రతాప్. ముడుచుకుని పడుకు న్నట్టున్నాడు. స్పృహలేదు. అతను పడుకున్న తీరునుబట్టి చూస్తే చనిపోయాడా బ్రతికి ఉన్నాడా అన్న అను మానం నేపాళికి కలిగింది. ముక్కుదగ్గర వ్రేలుపెట్టి చూశాడు. శ్వాసలేదు. నాడి చూశాడు. చలనం లేదు. నేపాళి అను మానం మరింత ధృవపడసాగింది. స్పృహ తెప్పించడానికి తన దగ్గర ఉన్న మందులన్నీ వాడాడు. కాని ప్రతాప్‌కు స్పృహ రాలేదు.

# 2

నరేంద్రమహారాజు, జయంత్, మంత్రి తంత్రవహి దట్టంగా ఉన్న చెట్లక్రింద విశ్రాంతి తీసుకుంటూ నేపాళి, కాళికోసం ఎదురుచూడసాగారు. గుఱ్ఱాలు ప్రక్కనే స్వేచ్ఛగా నిలబడి ఉన్నాయి.

'వెళ్ళి చాలా సేపయింది. ఇంకా ఎవరూ రాలేదు. కారణ మేమిటో!' అన్నాడు మహారాజు మంత్రి నుద్దేశించి.

'అదే విచిత్రంగా ఉంది. ఆ పెట్టెలో ఏముందో అనే అనుమానం కొద్దీ మనం వాళ్ళను పంపించాం. చివరికి వాళ్ళే అపాయంలోనైనా చిక్కుకోలేదుకదా!' అన్నాడు తంత్ర వహి.

'నేపాళి అంత సులభంగా ఇతరుల చేతుల్లో చిక్కుతా డంటావా?' మహారాజు నమ్మకంగా అన్నాడు.

'ఏమో, చెప్పలేం. ఎంతటివాళ్ళకైనా ఒక్కోసారి అపజయం తప్పదు. ఏ సమయంలో ఎలా జరుగుతుందో ఎవరు చెప్ప గలరు. అంతా దైవనిర్ణయం. మానవుడు ప్రయత్నం చేయ గలవాడు మాత్రమే కదా!' మంత్రి అన్నాడు. అతని హృద యంలో ఏదో అనుమానం అప్పటికే చెలరేగింది.

'ఐతే, నేనటువెళ్ళి వాళ్ళేమయ్యారో ఒకసారి చూసి వస్తాను,' అన్నాడు జయంత్.

'అలా కాదు. ఒంటరిగా వెళ్ళడం ఎలాగైనా ఈ సమ యంలో మంచిదికాదు. వెళ్తే అందరం కలిసి వెళ్దాం,' అన్నాడు తంత్రవహి.

మహారాజు 'సరే'నంటూ తన అంగీకారాన్ని తెలియ చేశాడు.

ముగ్గురూ లేవబోతున్న సమయంలో దూరంనించి ఒక గుర్రం వస్తూ కనిపించింది.

'ఏదో గుర్రం ఈ ప్రక్కకే వస్తోంది. కాళి లాగుంది,' అన్నాడు పరీక్షగా చూస్తూ జయంత్.

కాసేపట్లో కాళి వచ్చి గుఱ్ఱం మీదనించి దిగింది. ఆమె మొఖంలో కంగారు, విచారం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె నెమ్మదిగా మహారాజు దగ్గరకువచ్చి తలవంచుకు నిలబడింది.

'ఏం, ఏం జరిగింది? పెట్టెలో ఏముంది?' మహారాజు ఆత్రంగా ప్రశ్నించాడు. ఒక్కక్షణం వరకు కాళి మాట్లాడలేకపోయింది. తర్వాత నెమ్మదిగా హీనస్వరంలో ఇలా అంది.

'ఆ పెట్టెలో ఏముందో చెప్పేముందు మరో కొన్ని ముఖ్య విషయాలు మీకు నేను చెప్పాలి.'

'అవేమిటో త్వరగా చెప్పు.'

'ఆ పెట్టెను వాళ్లు దగ్గర్లోనే ఉన్న ఒక భూగృహంలోకి తీసుకువెళ్ళారు. మేమూ వాళ్లననుసరిస్తూ అక్కడికి వెళ్ళాం. అదే భూగృహంలో లావణ్య, కిరణ్మయి కూడా బంధింపబడి ఉన్నారు.'

మహారాజు, మంత్రి ఆశ్చర్యంగా తలలు పైకెత్తి కాళి వంక చూశారు. లావణ్య అక్కడుందన్న సంగతి వినగానే జయంత్ ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయాడు. ఇంకా

కాళి ఏం చెబుతుందో అని కాళి వంక క్రీగంట చూడ సాగాడు.

'మరి వాళ్లను విడిపించే ఉపాయమేదీ చూడలా?' అన్నాడు మంత్రి.

'ఆ భూగృహం అసలెవరిదో?' మహారాజు అనుమానంగా అడిగాడు.

'పాడుపడినట్టున్న ఆ భూగృహం ఎవరిదో మాత్రం తెలియదు. ఐతే ఆ గృహంలో ఎవరూ లేరు. దాదాపు నిర్మానుష్యంగా ఉన్నట్టే. లావణ్యను మేం ఎలాగో విడిపించగలిగాం. కాని కిరణ్మయిని విడిపించడం చాలా కష్టంగా కనిపిస్తోంది,' అని జవాబిచ్చింది కాళి.

'నేపాళి అక్కడే ఉన్నాడా?' మహారాజు ప్రశ్నించాడు.

'ఔను. లావణ్య కూడా అతనితోపాటు ఉంది. ఈ సంగతిచెప్పి మిమ్మల్ని కూడా అక్కడికి తీసుకువెళ్దామని నేను వచ్చాను.' కాళి అంది.

'మీరు ఎంతసేపటికీ రాకపోయేసరికి మేమే అటు వద్దామని బయలుదేరాం. ఇంతలో నువ్వు వచ్చావు.' వెళ్ళాలన్న కుతూహలంకొద్దీ జయంత్ అన్నాడు.

'అందరం అక్కడికి వెళ్తే ప్రతాప్‌ను అన్వేషించడంలో జాగు జరగదుకదా!' మహారాజు తన అనుమానాన్ని వెలిబుచ్చాడు.

'ముందు ఆ భూగృహం దగ్గరికి వెళ్లి తర్వాత అటునించి కొందరం ప్రతాప్ గారికోసం వెళ్లవచ్చులెండి.' కాళి అంది.

ప్రతాప్ కూడా అక్కడ ఉన్నాడన్న విషయం కాళి చెప్పలేకపోయింది. ప్రతాప్ మరణవార్తను వాళ్ళకు వినిపించడం ఇష్టం లేక కాళి బాధతో క్రుంగిపోతోంది. ఎలాగో వాళ్ళను అక్కడికి తీసుకువెళ్తే వాళ్ళే స్వయంగా ప్రతాప్‌ను చూస్తారు.

నలుగురూ గుర్రాలమీద ఆ భూగృహంవైపు బయలుదేరారు. కాసేపట్లో అక్కడికి చేరుకున్నారు. ప్రహరీగోడ బయటనే గుర్రాలు దిగి, వాటినక్కడ వదలి నలుగురూ లోపలికి ప్రవేశించారు.

వీళ్ళటు రావడం చూసిన నేపాళి ఒక చెట్టుమీదనుండి దిగి ఎదురువచ్చాడు. అతని మొఖంమీద విషాదరేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మహారాజాదులతో ఏం చెప్పాలో అతనికి తోచడంలేదు.

కాళి చేసిన సంజ్ఞనుబట్టి ప్రతాప్ విషయం కాళి వాళ్ళతో చెప్పలేదని అతను గ్రహించాడు. కాని తానావిషయం చెప్పకుండా ఎలా ఉండగలడు? కాళి మహారాజాదులను తీసుకురావడానికి వెళ్ళిన తర్వాత జరిగిన అనేక సంఘటనలు అతనికి మరింత విచారాన్ని కలుగచేశాయి. ఈ పరిస్థితిలో తానెలాగూ ప్రతాప్ విషయం వాళ్ళకు చెప్పకతప్పదు. కాని ఆ విషయాన్ని ఎంత జాగ్రత్తగా, ఎలా చెప్పాలా అనే అతను ఆలోచించసాగాడు. ఆ ఆలోచనలో ఉండిపోయి కాసేపటివరకు ఏమీ మాట్లాడలేదు.

'ఏమిటి మాట్లాడకుండా అలా నిలబడ్డావ్? ఏం జరిగింది? లావణ్య, కిరణ్మయి ఎక్కడ ఉన్నారు?' మహామంత్రి నేపాళిని ప్రశ్నించాడు.

ఆలోచనల్లోంచి మేల్కొన్న నేపాళి ఒక్కక్షణం తర్వాత నెమ్మదిగా అన్నాడు.

'లావణ్య, కిరణ్మయి మాత్రమే కాదు. ప్రతాప్ గారు కూడా ఇక్కడే ఉన్నారు.'

ఈమాట వినగానే ఒక్కసారిగా అందరికీ ఆశ్చర్యం కలిగింది. ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయాయి.

'ఈ సంగతి కాళి చెప్పలేదే ?' అన్నాడు జయంత్.

నేపాళి ఆ ప్రశ్నకు జవాబివ్వకుండా తన ధోరణిలో అన్నాడు—

'స్పృహతప్పి ఉన్న స్థితిలో కొందరు భటులు ఆయనను తీసుకువచ్చి భూగృహంలో పడవేశారు.'

'ఐతే ఇంకా ఆలస్యం దేనికి? కావలసిన వాళ్లందరూ ఇక్కడే ఉన్నారన్నమాట. వెంటనే వెళ్లి అందరినీ చూద్దాం.' అన్నాడు మహారాజు ఆతురతకొద్దీ.

'ఔను,' అంటూ తల ఊపాడు జయంత్. అతనిలో లావణ్యను చూడాలన్న ఆతురత ఎక్కువైంది.

'కాని—' నేపాళి ఏదో చెప్పబోయి ఆగాడు.

'ఏమిటి చెప్పడానికి సందేహిస్తున్నావు?' తంత్రవహి అడిగాడు.

'ఆ భూగృహంలోకి ప్రవేశించడానికి ఇప్పుడు దారిలేదు. అన్ని దారులూ మూసివేయబడ్డాయి. ఆ తలుపుల్ని తెరవడం మనకు సాధ్యం కాదు.'

'అదేమిటి?' కాళి ఆశ్చర్యంగా అంది.

'ఔను. నువ్వు వెళ్లింతర్వాత కాసేపటికి బయటినించి ఏదో కోలాహలం వినిపించింది. అదేమిటో చూద్దామని లావణ్యను అక్కడే ఉండమని చెప్పి నేను బయటికి వచ్చాను. గుర్రాలమీద కొందరు ప్రహరీగోడను సమీపించడం నేను చూశాను. వెనక్కి వెళ్లడానికి తగిన సమయంలేక వెంటనే దగ్గరలో ఉన్న ఒక చెట్టెక్కి దానిమీద ఆకులమధ్యగా ఎవరికీ కనిపించకుండా కూర్చున్నాను. ఇంతలో గుర్రాలు దిగి చాలమంది లోపలికి వచ్చారు. అందులో ఒక సాధు వాళ్ల నాయకుడు కాబోల్ను చాలా బలంగా ఉన్నాడు. సరిగ్గా వాళ్లు నేనున్న చెట్టుదగ్గరికి వచ్చారు. ఇంతలో ఆ గదిలోంచి పారిపోయిన భటుడు ఎక్కడినించి వచ్చాడో పరుగెత్తుకుంటూ వచ్చాడు. మనమంతా ఇంకా ఆ భూగృహంలోనే ఉన్నామని చెప్పాడు. దాంతో అతనికి కోపం వచ్చినట్టుంది. 'భూగృహం ప్రధాన ద్వారం మూసేస్తాను. వాళ్లు బయటికెలా వస్తారో చూద్దాం,' అంటూ ముందుకు వెళ్ళాడు. తర్వాత వాళ్ళేంచేసిందీ నాకు సరిగా కనిపించలేదు. ఎటు వెళ్ళిపోయిందీ కూడా తెలియలేదు. ఇటు మాత్రం రాలేదు,' అన్నాడు నేపాళి.

'తర్వాత నువ్వు వెళ్ళి తలుపులు నెట్టిచూశావా?' తంత్రవహి అడిగాడు.

'లేదు. మీకోసం ఎదురుచూస్తున్నాను.'

'సరే. ముందక్కడికి వెళ్దాం పదండి. లోపలికి వెళ్లడానికవకాశం లేనప్పుడు అప్పుడే ఆలోచిద్దాం.'

అందరూ భూగృహం ప్రధాన ద్వారం దగ్గరకు వెళ్ళారు. జయంత్ ద్వారం తెరవడానికి ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆ తలుపులను తెరవడం ఎలాగో వాళ్లెంత ఆలోచించినా ఏ ఉపాయమూ తట్టలేదు. ఏం చెయ్యాలా అని ఆలోచనల్లో మునిగిపోయి అందరూ నిరాశగా అక్కడే కూర్చుండిపోయారు.

## 3

నర్మద చాలాదూరం గుర్రంమీద ప్రయాణం చేసింది. దట్టంగా చెట్లు పెరిగిన ఆ అడవిదాటి ఎడారిలాంటి స్థలంలోకి ప్రవేశించింది. దానిలో చాలదూరం వెళ్ళింతర్వాత ఒక చిన్నకొండ ఆమెకు కనిపించింది. అప్పటికి గుర్రం బాగా అలసిపోయింది. ఆమె కూడా అలసిపోయినట్టే.

గుర్రం దిగి దానిని అక్కడే వదిలేసి ఆమె ఆ కొండదగ్గరకు వెళ్లింది. దానిలో ఒకే ఒకగుహ ఉంది. ఆ గుహలో బాగా చీకటిగా ఉంది. దానినెవరూ ఉపయోగించుకుంటున్నట్టు లేదు.

ఆ గుహ మొనలో రాతిబండమీద కూర్చుని నర్మద శారీరకమైన అలసట తీర్చుకుంటూ ఆలోచించసాగింది. ఆ ఆలోచనలు ఆమెను వెనక్కు తీసుకువెళ్ళాయి. తాను ప్రతాప్,

మంత్రవాదితోపాటు వెళ్ళిన ఆ భవనాన్ని గురించి ఆమె ఆలో చించసాగింది.

ఆ భవనంలో ప్రతాప్ వగైరాలు కోపగించుకుని వెనక్కి చూడకుండా దూకేసేటంత దారుణకృత్యం ఏం జరుగుతోందో! ఏమైనప్పటికీ ప్రతాప్ అపాయంలో చిక్కుకున్నాడు.

నర్మద ముఖ్యంగా ప్రతాప్‌ను గురించి ఆలోచించసాగింది. అతనిని తాను రెండుమూడు అపాయాలనుండి కాపాడింది. కాని ఈసారి అతనిని రక్షించలేకపోయింది. ఆ భవనాన్ని గురించ తనకంతగా తెలియదు. అది ఈ మధ్యనే కొత్తగా నిర్మించబడినట్టు మాత్రం తనకు తెలుసు.

నర్మద ఆలోచనలు అకస్మాత్తుగా తెగిపోయాయి. గుఱ్ఱపు డెక్కల చప్పుడు ఎక్కడినించో ఆమెకు వినిపించసాగింది. కూర్చున్నచోటినించి నెమ్మదిగా లేచింది. ఇవతలికి వచ్చి నాలుగుప్రక్కలా చూసింది.

తాను ఎదురుచూస్తున్న వ్యక్తులు గుర్రాలమీద రావడం గమనించిన నర్మద ఆనందంగా అక్కడే నిలబడింది. ఆమె గుర్రం కొండగుహలోంచి లేచివచ్చిన ఆమెను చూడగానే ఒకసారి సకిలించింది.

ఇంతలో యమదూత, దూరదర్శి గుర్రాలమీదవచ్చి అక్కడ దిగారు. నర్మద ఆ ఇద్దరినీ సంతోషంగా కొండగుహలోకి అహ్వానించింది. ఆ ఇద్దరినీ అక్కడికివచ్చి తనతో మాట్లాడవలసిందిగా ఆమె ఇదివరకు వాళ్లకు చెప్పి ఉంది. అందుకే తానా సమయానికి అక్కడకు చేరుకుంది.

ముగ్గురూ గుహలో రాతిబండలమీద కూర్చున్నారు. కాసేపటివరకు మాట్లాడలేదు. ఎవరు ముందుగా మాట్లాడాలా అన్నదే వాళ్ల సమస్య. తర్వాత నర్మద నిశ్శబ్దాన్ని చీలుస్తూ మాట్లాడింది.

'తాళపుచెవి మీరు తీసుకువచ్చారా ?'

ఈ ప్రశ్న దూరదర్శినుద్దేశించి ఆమె అడిగింది. స్వర్ణ గ్రంథం రహస్యం కొంతవరకు దూరదర్శికి తెలుసు. ఆ గ్రంథం ఎక్కడ ఉందో అతను తెలుసుకున్నాడు. ఆ గది తాళపుచెవి అతనిదగ్గర ఉంది. దానిని నర్మదకు ఇస్తానని అతను వాగ్దానం చేశాడు. ఇదంతా జరిగింది యమదూత ద్వారా.

స్వర్ణగ్రంథం ఉన్న గది తాళపుచెవిని దూరదర్శి నర్మద కిచ్చేట్టు, నర్మద దూరదర్శికి ఎలాంటి ఆపదా సంభవించకుండా వీలైనంతవరకు కాపాడేట్టు ఆ యిద్దరిమధ్య సంధి కుదిర్చాడు యమదూత.

ఇప్పుడదే సందర్భంగా వాళ్ళు ముగ్గురూ అక్కడ కలుసుకున్నారు. అందుకే నర్మద తాళపుచెవిని గురించి దూరదర్శిని అడిగింది.

దూరదర్శి సమాధానంగా తల ఊపాడు. ఏమీ మాట్లాడలేదు.

'ఇంకా ఆలస్యం దేనికి. దానిని బయటికి తియ్యండి,' అన్నది నర్మద.

దూరదర్శి ఎందుకో సందేహించసాగాడు. యమదూత అతనివంక ఓసారి చూసి తర్వాత నర్మదతో నెమ్మదిగా అన్నాడు.

'మేం కోరిన ప్రకారం మీరు చేస్తానని ప్రతిజ్ఞ చెయ్యాలిగా.'

'ఏం కావాలో చెప్పండి.'

'మహారాణి సభలోని కొన్ని ముఖ్యవిశేషాలు తెలుసుకోవాలని దూరదర్శికి చాలా కుతూహలంగా ఉంది. ఆ విషయంలో అతను కోరినప్పుడల్లా మీరతనికి సహాయం చేస్తానని వాగ్దానం చెయ్యాలి. తర్వాత మంథర దగ్గర నా బాపతు కాగితాలను తెచ్చి యిస్తానని కూడా మాట ఇవ్వాలి.'

'అందుకు నేను సిద్ధంగానే ఉన్నాను.'

ముగ్గురు గుహ లోపలికి నడిచారు. లోపల ఓ మూలగా చిన్న రాతివిగ్రహం అస్పష్టంగా కనిపిస్తోంది. అది ఏ దేవతా విగ్రహమో వాళ్లకు సరిగా తెలియదు. ఐనా నర్మద ఆ విగ్రహం ముందు మోకరిల్లి యమదూత చెప్పిన ప్రకారం ప్రతిజ్ఞ చేసింది. దూరదర్శి అనుమానం తొలగిపోయినట్టయింది. ఒక చిన్న పెట్టెను బయటికితీసి నర్మదకిచ్చాడు. నర్మద ఒకసారి ఆ పెట్టెవంక పరీక్షగా చూసి దానిని దాచివేసింది.

తర్వాత కాసేపు నిశ్శబ్దం. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అనంతరం నర్మద ఆ ఇద్దరివంక ఓసారి చూసి అంది—

'మీరు నరేంద్రమహారాజుకు, వాళ్ల అనుయాయులకు సహాయం చేస్తూ ఉండాలి. వాళ్లకెన్నడూ అపాయం తలపెట్టకూడదు. మీరెప్పుడైనా ఇందుకు వ్యతిరేకంగా చేస్తే నేను నా ప్రతిజ్ఞకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉండదు.'

'అందుకేమీ సందేహంలేదు. జీవితంలో ఒకే ఒక చిన్న తప్పుచేశాను. ఆ తప్పుకు ఫలితాన్ని జీవితాంతం అనుభవిస్తు

న్నాను. ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నాను. ఇంకా తిరిగి ఆ తప్పుచేస్తానా,' అన్నాడు భయంకరంగా ఉండే యమదూత దీనంగా.

'ఒక్క మీకే కాదు నేనీసంగతి చెప్పేది! దూరదర్శికి కూడా,' నర్మద అన్నది.

దూరదర్శి చిరునవ్వు నవ్వాడు. ఆ చిరునవ్వులో పరిహాసం, పట్టుదల కనిపిస్తున్నాయి.

'నేను నరేంద్రమహారాజుకుగాని ఆయన పుత్రులకుగాని అపాయం చెయ్యదల్చుకుంటే ఇదివరకే చేసి ఉండేవాడిని. మహారాణిసభలో వాళ్ళు ప్రతాప్‌ను, జయంత్‌ను తమ కప్పగించమని కోరారు. ప్రాణాలమీద ఆశ వదలుకుని కూడా నేను వాళ్లమాట వినలేదు. చంపుతామని బెదిరించినా నేను వాళ్లను లక్ష్యపెట్టలేదు,' సగర్వంగా అన్నాడు దూరదర్శి.

'నేను కూడా ఇప్పట్లో నరేంద్రమహారాజాదులకు వీలైనంత సహాయమే చేశాను తప్ప అపకారం తలపెట్టలేదు. ముఖ్యంగా వాళ్లను చిత్రగృహంలోంచి విడిపించాను,' అన్నాడు తిరిగి యమదూత.

'ప్రస్తుతం వాళ్ళిప్పుడెక్కడ ఉన్నారో! ప్రతాప్ మాత్రం అపాయంలో చిక్కుకుని ఉన్నాడు. అతనిని కాపాడడానికి నేను వెళ్ళాలి,' నర్మద అన్నది.

'ప్రతాప్ ఎక్కడ ఉన్నాడు?' యమదూత ప్రశ్నించాడు.

'మహారాణి చేతుల్లో చిక్కి ఉంటాడు. ఆమె ఏ భూగృహంలోనో అతనిని బంధిస్తుందని నా అనుమానం. ఈ

విచిత్రగృహాల రహస్యాలన్నీ నాకు తెలుసుగా. ఇప్పుడే వెళ్ళి ప్రతాప్‌ను నేను విడిపించాలి!' నర్మద సమాధాన మిచ్చింది.

'ఐతే నేను మహారాజాదులు ఎక్కడున్నదీ తెలుసుకుని వాళ్ళకేదైనా సహాయం చెయ్యడానికి ప్రయత్నిస్తాను,' అన్నాడు యమదూత.

నర్మద దూరదర్శి వంక మీ రేం చేస్తారన్నట్టు చూసింది.

'భవాని నొకసారి చూడాలని నాకు చాలా కుతూహలంగా ఉంది. అవసరమైతే మహారాణి మయసభను మరోసారి దర్శిస్తాను,' అన్నాడు దూరదర్శి.

నర్మద నవ్వింది. 'ఇంకా భవానిమీద మోహం మీకు తొలగిపోలేదన్నమాట.'

దూరదర్శి ఆమాట విననట్టుగా అడిగాడు. 'భవాని ఎవరో చెప్పగలరా?'

'తప్పకుండా చెబుతాను. ఆమె మహారాణి చిన్న చెల్లెలు.'

దూరదర్శి ఆశ్చర్యంగా నర్మదకేసి చూశాడు. తన ఊళ్లో తనతోపాటు తిరిగి పెరిగినట్టున్న భవాని మహారాణి చిన్న చెల్లెలా! కాసేపటివరకు ఆ ఆశ్చర్యంలోనే అతను మునిగి పోయాడు.

'ఐతే మహారాణి పేరేమిటి?' చివరికి దూరదర్శి అడిగాడు.

'మహామాయ.'

'ఆమె రెండో చెల్లెలెవరు?'

నర్మద ఒకసారి తనలో తాను నవ్వుకుంది. యమదూతవంక విచిత్రంగా చూసి తర్వాత నెమ్మదిగా అంది.

'ఇంకా మీకీసంగతికూడా తెలియదన్నమాట. విచిత్రంగానే ఉంది. మహారాణి మహామాయ నా అక్క. భవాని నా చెల్లెలు.'

ఈ మాట వినగానే సూరదర్శికి అంతులేని ఆశ్చర్యం కలిగింది. ఆ ఆశ్చర్యంలో అతని నోట మాట పెగిలిరాలేదు.

'సరే. నేను వెళ్ళాలి. చాలా పనులున్నాయి. మీలో ఎవరైనాసరే నన్ను కలుసుకోతలచుకుంటే ఈ గుహదగ్గరకు రండి. రోజుకొకసారైనా నేనిక్కడికివచ్చి చూసిపోతుంటాను,' అన్నది నర్మద. వెంటనే గుహలోంచి బయటికివచ్చి తన గుర్రాన్ని పిల్చింది.

## 4

ఏం చెయ్యడానికీ తోచక దిగాలుగా కూర్చున్నారు మహారాజు, మంత్రి, జయంత్ వగైరాలు. నేపాళి కాళిని వెంటపెట్టుకుని ఆ భవనం చుట్టూ ఒకసారి తిరిగి రావడానికి బయలుదేరాడు.

వెళ్తూ వెళ్తూ కాళి అడిగింది. 'ప్రతాప్ గారి పరిస్థితి ఎలా ఉంది? నిజంగా ఆయన చనిపోయినట్టేనా?

నేపాళి వెంటనే ఏమీ జవాబివ్వలేదు. తర్వాత గాద్గదికంగా ఇలా అన్నాడు.

'నేను ఏదీ తేల్చుకోలేకుండా ఉన్నాను. పెట్టెలో ఆయన పడుకుని ఉన్న పరిస్థితినిబట్టి చూస్తే స్పృహతప్పి ఉన్నట్టనిపిస్తుంది. కాని నాడికి చలనంలేదు. ఈ పరిస్థితిలో

చనిపోయినట్లే అనుకోవాలి. కాని చనిపోతే మొఖంలో ఆ కళ ఉండదు. చివరికిదంతా అయోమయంగా ఉంది నాకు.'

కాళి నేపాళివంక చూసింది విచారంగా. 'చివరికి ఆయనను మనిద్దరమే ముందుగా చూడడం తటస్థించింది. అందుకనే లోలోపల మథనపడుతూ బయటికీసంగతి చెప్పలేక బాధ పడుతున్నాం.'

'అంతేకాదు. మనకు ముఖ్యంగా కావలసినవాళ్ళు ముగ్గురూ ఇక్కడే ఉన్నారు. మనిద్దరం బాహాటంగా ఈ భవనంలో ప్రవేశించి వాళ్ల భటులను సంహరించడం వల్లనే ఈ అపాయపరిస్థితి ఏర్పడింది—అలా కాకుండా మనం మాయోపాయంతోనే మన పనిని నెరవేర్చుకుంటే చాలా బాగుండేది. మనం చేసిన పొరపాటుకు నేనిప్పుడు విచారిస్తున్నాను,' అన్నాడు నేపాళి కాళి మాటలు విన్నతర్వాత.

అప్పటికి ఆ ఇద్దరూ భవనం వెనుకవైపుకు చేరుకున్నారు. అటూ ఇటూ చూసి ముందుకు సాగడానికి సిద్ధంగా ఉన్నారు. ఇంతలో ఒక చిన్న పిలుపు వాళ్లకు వినించింది.

ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు. ఆ పిలుపు ఎటునించి వినిపించిందీ వాళ్లకు స్పష్టంగా తెలియలేదు. దిక్కులు చూస్తుండగా మళ్ళీ అదే పిలుపు వినిపించింది. ఈసారి నేపాళి ఆ ధ్వని ఎటునుంచి వస్తున్నదీ గమనించాడు. కాని ఆ ప్రక్క ఎవరూ లేరు. భూగృహం గోడతప్ప అటు మరింకేమీ కనిపించలేదు. నేపాళి పరీక్షగా ఆ గోడకేసి చూశాడు.

గోడకు నిలువెత్తున ఒక చిన్న రంధ్రం అతనికి కనిపించింది. పరీక్షగా చూస్తే ఆ రంధ్రంలోంచి ఒక కన్ను అతనికి

కనిపించసాగింది. నేపాళి వెంటనే ఆ గోడదగ్గరకు వెళ్ళాడు. ఇదంతా ఆశ్చర్యంగా చూస్తూ నేపాళితోపాటు కాళి కూడా అటు వెళ్ళింది.

'ఎవరాప్రక్క?' నేపాళి గోడదగ్గరకు వెళ్ళి ఆ రంధ్రం లోంచి అటుప్రక్కకు చూస్తూ ప్రశ్నించాడు.

'ఎవరైతేనేం? ఆ సంగతి నీకనవసరం. కాని నేను చెప్పే సంగతి విను. నా మాటగా మీ మహారాజుగారితో ఇలా చెప్పు. ఈ భూగృహం ప్రధాన ద్వారాన్ని నేను తెరుస్తున్నాను. ఒక అరగంటవరకు దానినలా తెరచి ఉంచుతాను. ఈ లోపల మీరు మీ బలగంతో భూగృహంలో ఎక్కడైనా తిరగవచ్చు. అరగంట దాటింతర్వాత మాత్రం ప్రధాన ద్వారం తిరిగి మూసివేయబడుతుంది.' అవతలివైపునించి వినిపించింది.

నేపాళి ఆనందాన్ని అపుకోలేక ఎగిరి గంతువేశాడు. ఒక్క పరుగులో మహారాజాదులున్న చోటికి వెళ్ళాడు. ప్రధాన ద్వారాన్ని నెట్టి చూశాడు. తలుపులు తెరచుకున్నాయి. అందరూ ఆనందంగా అటుకేసి చూశారు.

'ఎలా విడిపోయాయి తలుపులు?' ఆనందం పట్టలేక జయంత్ నేపాళిని అడిగాడు.

'ఏదో అజ్ఞాతశక్తి మనకు సహాయం చేస్తోంది,' అంటూ నేపాళి జరిగిందంతా వాళ్ళకు వివరించి చెప్పాడు.

'అరగంట గడవుమాత్రం ఉందన్నమాట. ఐతే ఆలస్యం చెయ్యకండి,' మహామంత్రి అన్నాడు.

అందరూ భూగృహంలోకి ప్రవేశించారు. నేపాళి తిన్నగా ఆ పెట్టె ఉన్న గదివైపుకు దారితీశాడు. మిగిలిన అందరూ అతనిని అనుసరించారు. మొదట ఉన్న నాలుగైదు గదులనుదాటి చివరి గదిలోకి ప్రవేశించారు. నేపాళి తలుపు త్రోసి ఆ గదిలోకి ఆతురతగా చూశాడు.

కాని ఆ గదిలో ఎవరూలేరు. అంతటా నిశ్శబ్దంగా ఉంది. అక్కడ ఉండవలసిన పెట్టెలేదు. దానిప్రక్క కూర్చుని ఉండాల్సిన లావణ్యా కూడా లేదు. నేపాళి పిచ్చివాడిలా అలాగే నిలబడిపోయాడు.

'ఏమిటలా నిలబడ్డావు? ప్రతాప్ ఎక్కడ? లావణ్యా, కిరణ్మయి ఎక్కడ ఉన్నారు?' మహారాజు ప్రశ్నించాడు నేపాళిని.

'పెట్టె ఇక్కడే ఉండాలి. ఏమైందో తెలియదు. లావణ్య కూడా కనిపించడంలేదు. అంతా విచిత్రంగా ఉంది,' అన్నాడు నేపాళి.

మహామంత్రి, కాళి విడివిడిగా బయలుదేరి భూగృహం లోని గదులన్నీ గబగబా వెదకనారంభించారు. ప్రతాప్ కని పిస్తాడన్న మహారాజు ఆశ నిగాశ ఐంది. జయంత్ మనస్సు లావణ్య కనిపించకపోవడంతో మరింత బాధపడసాగింది. కిరణ్మయి ఆ గదిలో ఉందో లేదో చూడడానికి వెళ్ళింది కాళి.

నేపాళి గది మధ్యగా ఉన్న సింహపుతలవంక చూశాడు. అది యథాస్థానంలో ఉంది. దానిని తిరిగి అక్కడికి చేర్చిం దెవరో నేపాళికి తెలియలేదు. ప్రక్కనే ఉన్న జయంత్ సహాయంతో అతను ఆ సింహపుతలను మళ్ళీ ప్రక్కకు

నెట్టాడు. మహారాజును, జయంత్‌ను అక్కడే ఉండమని చెప్పి తాను ఒంటరిగా సొరంగంలోకి వెళ్ళాడు.

ఏ గదిలోనూ తంత్రవహికి ఎవరూ కనిపించలేదు. కిరణ్మయి కూడా ఆ గదిలో కనిపించకపోవడంతో కాళి నిరాశగా వెనక్కి తిరిగి వచ్చింది. అందరూ మళ్ళీ మహారాజు ఉన్న గదిలోకి వచ్చారు.

సొరంగంలోకి వెళ్ళిన నేపాళి ఎంతకీ తిరిగి రాలేదు. భూగృహంలో తాము ఉండవలసిన సమయం క్రమంగా గడచిపోతోంది. నేపాళి చాలా సేపటివరకు తిరిగి రాకపోవడంతో తాను సొరంగమార్గంలో వెళ్ళి ఏం జరుగుతోందో చూడాలనిపించింది జయంత్‌కు.

ఒంటరిగా సొరంగమార్గంలో వెళ్తానన్న జయంత్‌కు కాళిని కూడా తోడుగా పంపాడు మహామంత్రి. ఇద్దరూ మెట్లు దిగుతూ క్రిందకి వెళ్ళిపోయారు. నరేంద్రమహారాజు, తంత్రవహి ఆ గదిలో చూస్తూ నిలబడ్డారు.

వాళ్ళిద్దరూ కూడా మళ్ళీ తిరిగి రాలేదు. వెళ్ళినవాళ్ళకేదైనా అపాయం సంభవించిందేమోనని ఇద్దరూ భయపడ్డారు.

'మనం కూడా వెళ్దాం,' అన్నాడు మహారాజు. కాని ఇంతలో వెనకనించి ఏవో మాటలు వినిపించాయి. అవి ఎక్కడినించి వినిపిస్తున్నాయో మాత్రం వాళ్లకు తెలియలేదు ఎంత పరిశీలించి చూసినా.

'మహారాజా! ఆ సొరంగమార్గంలో వెళ్లడం శ్రేయస్కరం కాదు. వెళ్ళినవాళ్ళు శత్రువుల చేతిలో చిక్కారు. మీరు వెంటనే వెనక్కి వెళ్లిపొండి. లేకపోతే ప్రధాన ద్వారం

మూసివేయబడుతుంది. మీరిక్కడే చిక్కుబడిపోతారు. రాజకుమారులను గురించి మీరు విచారించకండి. నేను మీ శ్రేయోభిలాషిని. వాళ్లను కాపాడడానికి నేను శాయశక్తులా ప్రయత్నిస్తాను. మీరు వెనక్కి వచ్చి తిన్నగా రాయదుర్గం వెళ్ళిపోవడం మంచిది.'

మహారాజు ఈ మాటలన్నీ శ్రద్ధగా విన్నాడు. కాని ఇవి నిజమైన మాటలో, తమనెవరైనా మోసగించడానికి అన్న మాటలో అని ఆయనకు అనుమానం కలిగింది. మహామంత్రి వంక మౌనంగా చూశాడు.

తంత్రవహి ఒక్కనిమిషం ఆలోచించాడు. తర్వాత మహారాజువంక తిరిగి అన్నాడు.

'ఎలాగైనా మనం ఇక్కడినించి వెళ్ళిపోవడమే మంచిది. లేకపోతే మరీ అపాయకర పరిస్థితి సంభవించవచ్చు. మనం బయటికి వెళ్ళి రాజకుమారులను అన్వేషించడానికి సమర్థులైన గూఢచారులను పంపుదాం.'

'ఇంతకూ ఈ భూగృహంలో దాగి మనకీ మాటలు చెబుతున్నది మనకు శత్రువులంటారా, మిత్రులంటారా?' మహారాజు సందేహంగా అడిగాడు.

'ఆ సంగతి నేను మాత్రం ఎలా చెప్పగలను,' తంత్రవహి వెనక్కి అడుగు వేసి అన్నాడు.

ఇద్దరూ వెనక్కి తిరిగి ప్రధాన ద్వారంగుండా బయటికి వచ్చేశారు. వచ్చిన పని జరగకపోగా, మిగిలినవాళ్లను కూడా శత్రువులకప్పగించి వెళ్తున్నందుకు మహారాజు చాలా బాధపడసాగాడు. మంత్రి కూడా ముందేంచెయ్యాలో అని

గాఢంగా ఆలోచించనారంభించాడు. కాని అతనేం చెయ్యగలడు! గూఢచారుల పనికి తాను పనికిరాడు.

మంత్రవాది ఏమైందీ తెలియలేదు. అతనెక్కడ చిక్కుకుపోయిందీ కూడా తెలుసుకోవడం కష్టం. ఇక మిగిలిన నేపాళి, కాళి భూగృహంలో చిక్కుకుపోయారు.

అంతా అగమ్యగోచరంగా ఉంది. ఎటుచూసినా దారి కనిపించడంలేదు. రాజకుమారులను ఎలా వెదికించడమో, ఎక్కడని వెదికించడమో మహామంత్రి కర్థం కావడంలేదు. మహారాజుకెంతో కొంత ధైర్యం చెప్పగలిగాడుకాని తనకు మాత్రం ధైర్యం చాలడంలేదు.

బయటికి వచ్చింతర్వాత మహారాజు అడిగాడు. 'ఇప్పుడు మనం ఏం చేద్దామంటారు?'

'రాయదుర్గానికో, మన రాజ్యానికో వెళ్ళిపోదాం,' అన్నాడు తంత్రవహి.

మహారాజుకు వయస్సు మీరింది. ఆయన ఈ ఆవేదనల మధ్య కుమిలిపోతూ ఇక్కడ ఉండడం కంటే ఎక్కడికైనా వెళ్ళి నిర్మలంగా విశ్రాంతి తీసుకోవడం మంచిదని మంత్రి భావించాడు.

'మరి రాజనుమారుల సంగతి!' మహారాజు బాధగా అన్నాడు.

'ఆ సంగతి నేను చూసుకుంటానుగా. మీరు నిశ్చింతగా ఉండండి. ఆ బాధ్యతంతా నామీద పెట్టేసెయ్యండి.' మంత్రి సమాధానమిచ్చాడు.

మనస్సు వికలమైన పరిస్థితులలో భారాన్నంతనీ మహా మంత్రిమీద వదలడం నరేంద్రమహారాజు కలవాటే. అందు చేత ఇంకేమీ ఆలోచించకుండా రాజకుమారుల రక్షణ బాధ్యతనంతా తంత్రవహిమీద వదలడానికే ఆయన నిశ్చ యించుకున్నాడు.

'సరే. మన రాజ్యం వెళ్ళిపోదాం. అక్కడినించి బయలు దేరివచ్చి చాలాకాలమైంది కూడా. మనవాళ్లంతా ఎలా ఉన్నారో,' అన్నాడు.

వెంటనే ఇద్దరూ ప్రహరీ గోడదాటి తమ గుర్రాలదగ్గరకు వచ్చారు.

ఎటువంటి రాజ్యకాంక్షగాని, అధికారవాంఛగాని లేని తమను ఇతరులు ఎందుకిన్ని బాధలు పెడుతున్నారో నరేంద్ర మహారాజుకర్థం కాలేదు. ఒకోసారి ఈ కష్టాలన్నీ తలచు కొంటూంటే రాజ్యం వదలి సన్యాసం పుచ్చుకోవాలనిపిస్తుం టుందాయనకు.

అనేకవిధాలుగా ఆలోచిస్తూ మహారాజు తన గుర్రాన్ని ఆరోహించాడు. తంత్రవహి కూడా అశ్వారోహణం చేశాడు. ఇద్దరూ నెమ్మదిగా ముందుకు సాగారు. ముందుకు శరీరాలు వెళ్తున్నా వాళ్ల మనస్సులు మాత్రం వెనకే ఉండిపోయాయి.

అప్పటికి క్రమంగా చీకటిపడింది. ఐతే ఆ చీకటి ఎక్కువ సేపు ఉండకముందే అర్ధచంద్రుడు ఆకాశరంగంలోకి ప్రవే శించాడు. వెన్నెల ప్రపంచాన్నంతటినీ ఆవరించి అందరినీ ఆహ్లాదపరుస్తోంది. ఆ వెన్నెలలో గుర్రాలు దారికోసం తడుము కోకుండా ముందుకు సాగిపోతున్నాయి.

మహారాజుగాని మహామంత్రిగాని ఎవరూ మాట్లాడడం లేదు. ఇద్దరూ మౌనంగా ఉన్నారు. ఎవరి ఆలోచనలు వాళ్లను సతమతం చేస్తున్నాయి. ఆ ఆలోచనలమధ్య వాళ్లకింకే విషయాలు తోచడంలేదు.

## 5

మబ్బులు లేకుండా ఆకాశం స్వచ్ఛంగా ఉంది. బాలసూర్యుడు తన లేతకిరణాలను ప్రపంచంమీద ప్రసరింపచేస్తున్నాడు. ఈ సమయంలో అడవుల్లోసైతం పచ్చని చెట్లమధ్యగా తిరగడం ఎవరికైనా ఆనందకరంగానే ఉంటుంది.

కొండలమీదనించి క్రిందకి కలగానంచేస్తూ ప్రవహిస్తున్న వాగులు, వాగుల మధ్యగా నిశ్చలంగా నిలబడిన కొండరాళ్లు ఒకదానినొకటి ఒరచుకుంటూ శత్రుత్వంలోనే మైత్రిని నెరపుతున్నాయి. ఆ దృశ్యాన్ని చూడడానికి ఎవరి మనస్సు తహతహలాడదు!

యమదూత ఒక సెలయేటి ఒడ్డున కూర్చుని ఆనందంగా దానివంక చూస్తూ ఒడ్డున ఉన్న చిన్న రాళ్లను దానిలోకి విసరుతున్నాడు. మామూలు మనుష్యులకు భయాన్ని కలిగించే వ్యక్తి సైతం ప్రకృతి సౌందర్యానికి తలొగ్గక తప్పదు. ప్రకృతి ముందు ఆకారాల ప్రసక్తిలేదు. దానికి లోబడేది మనస్సులు మాత్రమే. యమదూత మనస్సు కూడా చాలా సరళమైందిగా కనిపిస్తుంది.

గడచిన తన జీవితమంతా అతని మనస్సులో మెదిలింది. విచిత్రంగా ఉంటుంది తన జీవితం. ఎన్నో వింతలు విశేషాలు తన జీవితంలో ఉన్నాయి. ఇంతవరకు దేశం ఎరగని అనేక ప్రముఖ సంఘటనలు తానెరుగును. ఎప్పుడో ఒకప్పుడు అందరూ ఆ సంఘటనలు తెలుసుకోవలసిందే. అందుకే తాను తన జీవితచరిత్ర వ్రాసుకొన్నాడు కాని ఆ కాగితాలన్నీ ఇప్పుడు తన దగ్గరలేవు. ఇప్పుడసలు తాను బ్రతికి ఉన్నా చచ్చిపోయినట్టే లెక్క. దేశమంతా తనను చనిపోయినట్టుగానే ఎంచుతోంది.

తన జీవితంలో మధుర విషాద సంఘటనలను తలచుకుంటూ యమదూత అప్రయత్నంగానే ఒక్కొక్క రాతిని నీళ్లలోకి విసురుతున్నాడు. రాళ్లు నీళ్లలోపడినప్పటి శబ్దం తప్ప వేరే శబ్దం ఏమీ వినిపించడంలేదు. ఆ చుట్టుప్రక్కల ఎవరూ లేరు కూడా.

కొండలమధ్యగా ప్రవహిస్తున్న ఆ సెలయేటి ఒడ్డున ఏకాంతంగా కూర్చుని గడచిపోయిన తన జీవితంలోని సంఘటనలను తలచుకుంటూ యమదూత ఆనందాన్ని, విచారాన్ని, తన్మయతను కూడా అనుభవిస్తున్నాడు.

అకస్మాత్తుగా నీళ్లలో ఏదో పెద్ద రాతిబండ పడిన శబ్దం వినిపించింది యమదూతకి. గత స్మృతులలోంచి మేలుకొని కళ్లెత్తి సెలయేటివంక ఓసారి చూశాడు. తర్వాత సెలయేటి అవతలి గట్టువైపు అతనిదృష్టి మరలింది.

యమదూత ఆశ్చర్యంగా ఆవైపు చూస్తూ ఉండిపోయాడు. అతని కళ్లు మూతలుపడడం లేదు. కనురెప్పలు కాసేపు అల్లల్లాడి ఆగిపోయాయి.

'మంథర,' అప్రయత్నంగా అతని నోటివెంట ఈ మాట వెలువడింది.

సెలయేటి అవతలి ఒడ్డున మంథర నిలబడి ఉంది. విలువైన దుస్తుల్లో బాగా అలంకరించుకుని ఉంది. ఒంటిమీది నగల్ని చూస్తే ఆమె బాగా ధనవంతురాలనిపిస్తుంది. కొంచెం వయస్సు మీరినా ఇంకా ఆమెలోని సౌందర్యం తొలగిపోలేదు.

మంథర సెలయేటిలోకి దిగి నెమ్మదిగా నడుస్తూ ఇవతలి ప్రక్కకు వచ్చింది. యమదూతకు ఎదురుగా మౌనంగా నిలబడింది. యమదూత కూడా ఆమెవంక చూస్తూ కూర్చుండిపోయాడు. కాని కాసేపటివరకు ఏమీ మాట్లాడలేదు.

'ఇక్కడికెలా వచ్చావు?' యమదూత ప్రశ్నించాడు చివరికి.

'ఏం, రాకూడదా?' ఆమె అన్నది.

'రాకూడదని నేననలేదు. అలా శాసించడానికి నాకేమీ హక్కు లేదు. ఎలా వచ్చావని అడిగాను. అంతే,' అన్నాడు యమదూత.

మంథర అతని ప్రక్కనే కూర్చుంది. అతనివంక చూస్తూ అంది.

'నడచి వచ్చాను.'

'పాపం! గుఱ్ఱాలు కరువయ్యాయా?'

'కాలేదు. కాని నిన్ను చూడాలనే ఉబలాటంకొద్దీ గుఱ్ఱం సంగతి మర్చిపోయి నడిచివచ్చాను.'

ఇద్దరూ ఒకరినొకరు వెటకారంగా మాట్లాడుకొంటున్నా ఆ భావాన్ని మాత్రం మొఖంలో వ్యక్తం చెయ్యడంలేదు.

'ఓహో, ఐతే నన్ను చూడాలని ఇన్నాళ్లకు ఎందుకనిపించిందో! మళ్ళీ నామీద ఏం కనికరం కలిగింది?' యమదూత ఆమెవంక గంభీరంగా చూస్తూ పరిహాసంగా ప్రశ్నించాడు.

'కనికరం కలిగికాదు వచ్చింది. కనికరం చూపమని కోరడానికి వచ్చాను,' మంథర అంది.

'అంతటి పరిస్థితి ఏం వచ్చింది?'

'ఆ సంగతి తర్వాత చెబుతాను. కోరింది చేస్తాననినాకు ముందు మాటివ్వాలి.'

'ఆ కోరేదేమిటో తెలియకుండా మాటెలా ఇస్తాను.'

'ఆ సంగతి తెలియనక్కరలేదు.'

'ఐనా నువ్వు చెయ్యలేని పనంటూ ఏముంది; నా దగ్గరకు రావడానికి?'

'ఉంది కాబట్టే అడగడానికి వచ్చాను.'

'ఆ పని నేను కూడా చెయ్యలేకపోతే!'

'చెయ్యగలవు. నాకు తెలుసు.'

'ఐతే అదేమిటో చెప్పు.'

'మాటిస్తే చెబుతా.'

'నేను నీకు మాటివ్వాలా! నీ క్రింద దాసుడుగా బ్రతుకుతున్న వ్యక్తిని. ఇంకా ఇలా ఎంతకాలం బాధిస్తావు నన్ను. నాకు మోక్షమంటూ లేదా?'

'లేకే' ఉంది.

'ఎప్పుడు ?'

'ఇప్పుడు నేను చెప్పేపని చేసినప్పుడు.'

'అదేమిటో చెప్పు.' సాధ్యమైనంతవరకు చెయ్యడానికి ప్రయత్నిస్తాను.'

'చెయ్యకపోతే ఫలితం నీకు తెలుసుగా,' మంథర కొంచెం బెదిరిస్తూ అంది.

'తెలుసు కాబట్టే సేవకుడిలా చెప్పిన పనులన్నీ చెయ్యడం.'

మంథర నవ్వింది. ఆ నవ్వులో పరిహాసం, కాఠిన్యం వ్యక్తమౌతున్నాయి.

'ఇలా నువ్వు నవ్వుతూనే ఉంటాయి. నేను ఏడుస్తూనే ఉంటాను. అందుకు కారణం నేను చేసిన ఒక తప్పు పని. జీవితంలో ఎప్పుడో చేసిన ఒక పనికి ఫలితాన్ని జీవితాంతం వరకు అనుభవించాలి కాబోలు,' యమదూత అన్నాడు.

మంథర మళ్లీ నవ్వింది. ఎగతాళిగా అతనివంక చూస్తూ 'అంది—' చేసిన పనిని గురించి ఎన్నడూ ఆలోచించకూడదు. ఆలోచించి ప్రయోజనంలేదు. తెలివికలవాడివైతే ముందు సంగతి ఆలోచించు. నేను చెప్పినట్టు విను.'

'నువ్వు చెప్పినట్టు చెయ్యక ఇప్పుడు నేను వ్యతిరేకించగలుగుతున్నానా?' యమదూత దీనంగా బాధపడుతూ అన్నాడు.

'ఐతే ఇప్పుడు కూడా నేను చెప్పిన పనిచెయ్యి.'

'అదేమిటో చెప్పు.'

మంథర ఒక్కక్షణం మౌనం వహించింది. తర్వాత యమ దూత వంక పరిశీలనగా చూస్తూ అంది—

'నర్మదను సంహరించాలి. ఆమె శవాన్ని తీసుకువచ్చి నా ముందు పడెయ్యాలి.'

ఈమాట వినగానే యమదూత ఒళ్లు జలదరించింది. కళ్ళు తిరిగినట్టయింది. భూమి కంపిస్తోందా అనిపించింది. నేలమీద కాళ్ళు కదలిపోసాగాయి. క్రింద సెలయేటినీళ్ళు కదలిపోయి తన ప్రతిబింబమే తనను కబళించబోతున్నట్టుంది.

అతనికేం చెప్పడానికి, ఏం చెయ్యడానికి తోచడంలేదు. ఒకప్రక్క క్రోధం ఆకాశాన్నంటుతోంది. మరోప్రక్క భయం అతన్ని పాతాళంలోకి దింపుతోంది. ఈ స్థితిలో ఏదీ సరిగా ఆలోచించుకోలేక మౌనంగా అలాగే కూర్చుండి పోయాడు.

'ఏం? ఈ పని చెయ్యడం నీ కిష్టంలేదా?' మంథర గర్జిస్తూ అడిగింది.

యమదూత హీనస్వరంలో నెమ్మదిగా అన్నాడు. 'ఈ ఒక్కపని తప్ప నువ్వేమడిగినా నేను చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను. ఈసారికి క్షమించు. ఈ పని నేను చెయ్యలేను.'

మంథర వికటంగా నవ్వింది. 'ఏం? నర్మద నీకు బంధువా, ఆమెను సంహరించడం ఇష్టం లేకపోవడానికి! లేక ఆమె నీ స్నేహితురాలా ?'

యమదూత ఏమీ మాట్లాడలేదు. తల వంచుకున్నాడు, ఏం మాట్లాడడానికీ తోచక.

'ఏమంటావు! నామాట కాదనడానికి నీకు ధైర్యం ఉందా?' మంథర గర్జించింది.

'ధైర్యం లేకనే ఇంతగా ప్రాధేయపడుతున్నాను. నా కుక్కతాడును చేతిలోపెట్టుకు ఆటలాడిస్తున్నావు.' యమదూత అన్నాడు.

'ఐనా అప్పుడప్పుడూ నాకు వ్యతిరేకంగా నువ్వు ప్రవర్తిస్తూనే ఉన్నావు,' మంథర కోపంగా అంది. ఆమె కళ్ళు ఎర్రబడి కొంచెం భయాన్ని కలిగిస్తున్నాయి.

'నీమాట నేనెప్పుడు కాదన్నాను?' యమదూత దీనంగా అడిగాడు.

'ఇప్పుడే.'

యమదూత ఒక్కక్షణం ఆగి అన్నాడు. 'ఈ ఒక్కపనీ నేను చెయ్యలేనన్నాను. అంతేగా. ఆ పని చెయ్యగల సామర్థ్యం నాకులేదు.'

'ఉందని నేనంటున్నాను. ఐనా ఎటువంటి ప్రయత్నమూ చెయ్యకుండానే శక్తి లేదంటే ఎలా నమ్మేది!'

'పోనీ ఈ ఒక్కసారి నన్ను క్షమించి వదలలేవా?'

'నీ ద్వారా నేను సాధించాల్సిన కార్యం ఇదొక్కటే. ఈ పనిని నువ్వు తప్ప ఇంకెవరూ చెయ్యలేరు. అందుచేతనే నీ దగ్గరకు వచ్చాను. ఈ పనే నువ్వు చేయలేనంటే ఎలా? అప్పుడందుకు ఫలితాన్ని నువ్వు అనుభవించాల్సి వస్తుంది.'

'పోనీ ఆమెను బంధించి స్పృహలేని స్థితిలో తీసుకువచ్చి నీకప్పగిస్తాను. తర్వాత నువ్వేమన్నా చేసుకో. ఇందు కిష్టమేనా?'

సరేనన్నట్టు మంథర తల ఊపింది. 'అలాగే చెయ్యి. ఆ తర్వాతి సంగతి నేను చూసుకుంటాను.'

'ఐతే ముందుగా నీ దగ్గర ఉన్న నా కాగితాలను నాకప్ప గించాలి.'

'అది మాత్రం కుదరదు. నర్మద మా చేతిలోకి వచ్చిం తర్వాతనే నే నా కాగితాలు ఇస్తాను.'

'నేనందుకు ఒప్పుకోను. ఇలా నువ్వు నన్ను నేకసార్లు మోస గించావు. ముందు కాగితాలిస్తేనే నేనాపని చేస్తాను.'

'ఐతే నా మాట వినవా?' మంథర పట్టరాని కోపంతో అంది.

'వినడానికవకాశంలేదు,' యమదూత ధైర్యంగా అన్నాడు. అంతకుమించి గత్యంతరంలేదు. ఎటు చూసినా తన కపాయమే. ముందు నుయ్యి. వెనక గొయ్యి. నర్మద సామాన్యురాలు కాదు. ఆమెను పట్టుకోడానికి ప్రయత్నిం చడమంటే పులినోట్లో తల పెట్టడమే. కాదంటే మంథర తనను బాధిస్తుంది. చివరికెలాగైతే నేం—యయదూత ధైర్యం చేసి మంథరకు ఎదురు తిరిగాడు.

'అంత సాహసమా!' మంథర కోపంతో వణకిపోతూ అంది.

'అవసరమైతే సాహసం చెయ్యక తప్పదు.' యమదూత కఠినంగా జవాబిచ్చాడు. నిద్రపోతున్న సింహం మేలుకొన్న ట్టయింది.

'సరే. నేనేం చేస్తానో నీకు తెలుసుగా.' మంథర కను బొమలు చిట్లించి కోపంగా అంది.

'నీకు చేతనైన పని చేసుకో.' యమదూత నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు.

మంథర శరీరమంతా క్రోధాగ్నిలో మండిపోసాగింది. ఇదివరకెన్నడూ యమదూత తనమాటనిలా తిరస్కరించలేదు. కాని ఇప్పుడు తానేం చెయ్యలేదు. అతనిని ఎదిరించి యుద్ధం చెయ్యగల శక్తి ఆమెకు లేదు.

'సరే,' అని పళ్లు నూరుతూ కోపంగా వెనక్కి తిరిగింది. మరుక్షణంలో యమదూత ముందుకు దూకి ఆమెను గట్టిగా పట్టుకున్నాడు. తనదగ్గర ఉన్న మత్తుమందును బలవంతంగా ఆమెకు వాసన చూపించాడు.

మంథర గిలగిల తన్నుకుని స్పృహ కోల్పోయి అతని చేతుల్లో ఒరిగిపోయింది. యమదూత ఆమెను తన భుజంమీద వేసుకుని పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ ముందుకు సాగాడు.

## 6

సాయంకాలం ఆహ్లాదకరంగా ఉంది. పక్షుల కలరవాలు చెవులకు హాయిని కలిగిస్తున్నాయి. అంతకుమించి వేరే శబ్దాలేమీ లేవు, ఆ ఎడారిలాంటి స్థలంలో. కాని కాసేపటికి ఎక్కడినించో గుర్రపుడెక్కల చప్పుడు వినిపించనారంభించింది.

నర్మద గుర్రంమీద ఎడారిలోని ఆ కొండ గుహదగ్గరకు వచ్చింది. గుర్రం దిగి దానినక్కడ వదలి తాను గుహలోకి

వచ్చింది. అక్కడ ఆమెకెవరూ కనిపించలేదు. అటూ ఇటూ ఒకసారి చూసి ఆక్కడ రాతిమీద చతికిలబడింది.

తన సహాయకురాలినొక యువతిని అక్కడికి రావలసిందిగా తాను కబురు చేసింది. కాని ఆ యువతి ఇంకా రాలేదు. కారణమేమిటో! మధ్యలో ఎవరూ ఆమెను అడ్డగించ లేదుగదా! నర్మద ఆలోచించసాగింది.

ఇంతలో బయట ఏదో చప్పుడైంది. నర్మద ఒక్కడుగు బయటికివేసి ఆతురతగా చూసింది. ఆ యువతి మాత్రం రావడంలేదు. కాని ఒక స్త్రీని భుజంమీద వేసుకువస్తున్న యమదూత ఆమెకు కనిపించాడు.

ఆమె అక్కడే నిలబడింది. ఇంతలో యమదూత అక్కడికి వచ్చాడు. గుహలోకి ఒకడుగువేసి భుజంమీద ఉన్న స్త్రీని క్రిందకి దించాడు.

'మీరిక్కడ ఉంటారో లేదో అనుకుంటూ వచ్చాను. అదృష్టంకొద్దీ ఇక్కడే ఉన్నారు,' అన్నాడు యమదూత ఆయాసంగా గాలి పీల్చుకుంటూ.

నర్మద అతనిమాటలు విన్నట్టులేదు. ఆ స్త్రీ వంక పరీక్షగా చూస్తోంది.

'మంథర కాదూ?' నర్మద అడిగింది.

'ఔను. మీరెరుగుదురా?' యమదూత ప్రశ్నించాడు. నర్మద నవ్వింది.

'నాకు తెలియదంటారా?'

'ఏమో! మీకు తెలుసని నాకెలా తెలుస్తుంది?'

'సరే. ఈమెనిప్పుడు ఇక్కడికెందుకు తీసుకువచ్చారు?'

'తీసుకురావలసిన పరిస్థితి ఏర్పడింది. తీసుకురాక తప్ప లేదు.'

'అంతటి పరిస్థితి ఎలా వచ్చింది.'

'కూర్చోండి. సావధానంగా చెబుతాను.'

నర్మద నాతిబండనీద కూర్చుంటూ అంది. 'ఈమె చాలా అపాయకారి అని మీకు తెలుసా?'

'తెలియకేం? ఇప్పటిదాకా ఈమె చెప్పు చేతుల్లోనే మెలగుతూ వచ్చాను. ఆమె చెప్పినట్లల్లా చేశాను. కాని ఇప్పుడా పరిస్థితి ఎదురు తిరిగింది.'

'మీరు ఆమెకు లోబడి ఎందుకుండాల్సి వచ్చింది?'

'మీరు అసలు సంగతంతా పూర్తిగా మర్చిపోయినట్టు న్నారు. ఈ మంథర దగ్గరనుంచేగా మీరు నా కాగితాలు సంపాదించి తెచ్చి యిస్తానని వాగ్దానం చేసింది!'

'ఔనౌను. అసలా సంగతే మర్చిపోయాను. మీరు నా జీవితచరిత్ర వ్రాసుకున్న కాగితాలన్నీ ఈమె దగ్గరున్నాయని చెప్పారుకదూ! అందుచేతనే మీరీమెకు లోబడి ఉండవలసి వస్తోందన్నమాట. పోనీ చంపడానికి కూడా వీలులేదు. చంపితే ఆ కాగితాలు లభించడం దుర్లభం.'

'అందుకనే మిమ్మల్ని ఆశ్రయించవలసి వచ్చింది.'

'ఐతే ఇప్పుడు మీ ఇద్దరికీ విరోధమెందుకేర్పడింది?'

యమదూత ఒక్క నిమిషంవరకు మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా అన్నాడు—

'ఇదివరకు ఈమె చెప్పిన పనులన్నీ చేశాను. కాని ఈసారి విపరీతమైన కోర్కె కోరింది. మిమ్మల్ని సంహరించిగాని

బంధించిగాని ఆమె కప్పగించాలట. ఈ పని నావల్ల కాదన్నాను. అంతటితో నామీద కోపగించుకుంది. మంథరకు కోపంవస్తే ఏం చేస్తుందో నాకు తెలుసు. అందుచేత ఏమీ తోచక చివరికి స్పృహ తప్పేట్టుచేసి మీ దగ్గరికి తీసుకు వచ్చాను. మీరేమైనా సలహా ఇస్తారేమోనని నా ఆశ.'

నర్మద కాసేపాలోచించింది మౌనంగా. 'ఇదంతా మహారాణి చేయిస్తున్నపని. నన్ను బంధించి తీసుకురమ్మని మంథరను పంపి ఉంటుంది. ఈమె ఆ పనిని మీకప్పగించడానికి ప్రయత్నించింది.'

'ఇప్పుడేం చెయ్యాలో ఆలోచించండి,' యమదూత అన్నాడు.

'ఆ సంగతే ఆలోచిస్తున్నాను. మీకెటువంటి ఆపదా రాకుండా నేను చూస్తానులెండి. ఇదే సమయంలో మీ కాగితాలు కూడా మీకు చిక్కేట్టు చేయగలను. నేను చేసేపనిలో మీరు నాకు సాయం చేయండి. అంతే, చాలు,' అన్నది నర్మద.

యమదూత సరేనన్నట్టు తల ఊపాడు. నర్మద ఒక్క నిమిషం ఆలోచిస్తూ అలాగే కూర్చుంది. ఇంతలో బయట అడుగులచప్పుడు వినిపించింది. నర్మద ఆతురతగా అటు చూసింది.

ఒక యువతి గబగబా ఆ గుహదగ్గరకు వచ్చి నిలబడింది. నర్మద ఆమెవంక ఓసారి చూసింది.

'దారిలో కొంచెం ఆలస్యమైంది. లేకపోతే ముందే వచ్చేదాన్ని,' అన్నది ఆ యువతి.

ఆ యువతిని చూస్తుంటే నర్మదకేదో ఆలోచన తట్టినట్టుంది. ఆమె మొఖం ఒకసారి విప్పారింది.

'నువ్వు తక్షణం నేను చెప్పినట్టు చెయ్యి,' నర్మద ఆ యువతితో అన్నది.

'ఏమిటో చెప్పండి.'

'నువ్వు నాలాగా వేషం వేసుకోవాలి. నీ వేషాన్ని నేను ధరిస్తాను. రంగు కూడా మార్చుకుంటాను. నువ్వు నా రంగు వేసుకో. నిన్ను, నన్ను ఎవరైనా చూసినా మన మారువేషాలను గుర్తించలేకుండా ఉండాలి.'

'సరే,' అన్నది ఆ యువతి అక్కడే నేలమీద పడిఉన్న మంథరవైపు, ప్రక్కనే ఉన్న యమదూతవంక చూస్తూ. యమదూతను చూడగానే కొంచెం మనస్సు అదిరిపోయినా వెంటనే ధైర్యం తెచ్చుకుంది.

నర్మద సంజ్ఞ ప్రకారం యమదూత ఆ గుహలోంచి బయటికి వెళ్ళాడు. నర్మద, ఆమె సహాయకురాలైన ఆ యువతి తమ తమ వేషాలను మార్చుకున్నారు వెంటనే. ఈ వేషంలో నర్మదను ఎంత పరిచయస్థులైనా గుర్తుపట్టడం కష్టం. మారు వేషాలు వెయ్యడంలో ఆమె చాలా నేర్పరి.

నర్మద, ఆ యువతి గుహలోంచి బయటికి రాగానే యమదూత కూడా అక్కడికి వచ్చాడు. నర్మద యమదూతవంక చూస్తూ అంది.

'నేనొక నాటకం ఆడబోతున్నానిప్పుడు. మీరు గుహలో చాటుగా దాక్కుని చూస్తూ ఉండండి. ఎట్టి పరిస్థితిలోను

మీరు మంథరకు కనిపించకూడదు. కనిపిస్తే నా ప్లానంతా చెడి పోయినట్టే.'

యమదూత ఆశ్చర్యంగా నర్మదవంక చూశాడు. నర్మద ఆ యువతితో ఇలా అంది.

'నువ్వు కూడా గుహబయట దాక్కో. నేను ఈ రాతిమీద చప్పుడు చేసినప్పుడు మా దగ్గరికి రా. అప్పటికి ఈమె స్పృహలో ఉంటుంది. నువ్వు నాలా ప్రవర్తించాలి. మేమిద్దరము నీకు శత్రువులైనట్టుగా మెలగాలి.'

యమదూత గుహలోపలికి, ఆ యువతి గుహబయటికి వెళ్ళి పోయారు. నర్మద తనదగ్గర ఉన్న మందు మంథరకు వాసన చూపించింది. మంథర గాఢనిద్రలోంచి మేల్కొన్నట్టు లేచి కూర్చుంది.

ఎదురుగా ఎవరో యువతిని చూడగానే మంథరకు ఆశ్చర్యం వేసింది.

'ఎవరు నువ్వు? నేనెక్కడున్నాను?' అని ప్రశ్నించింది మంథర.

నర్మద మారువేషంలో ఉండడంవల్ల మంథర ఆమెను గుర్తు పట్టలేకపోయింది.

'ఇదొక కొండగుహ. ఒక లావాంటి భయంకరమైన మనిషి నిన్ను స్పృహలేని స్థితిలో ఎక్కడికో తీసుకువెళ్తుండగా నేను చూశాను. ఒక స్త్రీపై అత్యాచారం చేస్తున్నాడనే కోపంతో అతనిని వెంటనే చంపివేశాను విషప్రయోగం చేసి. నిన్నిక్కడికి తీసుకువచ్చి స్పృహ తెప్పించాను.'

ఈమాట వినగానే మంథర ఆశ్చర్యానికంతులేదు. ఆమె ముఖం ఒక్కసారిగా వివర్ణమైంది. నర్మద ముఖంవంక కాసేపు పరీక్షగా చూసింది.

'నీ మాటలమీద నాకు నమ్మకం కలగడంలేదు. నీలాంటి యువతి అంత బలవంతుణ్ణి ఎలా సంహరించగలిగిందా అని నాకు అనుమానంగా ఉంది.'

నర్మద నవ్వింది. 'బలానికి మించినశక్తి వేరొకటుంది. మాయోపాయం. ఎంతటి బలవంతుడైనా నా చేతిలో ఓడి పోవలసిందే.'

'నువ్వెవరు?'

'ఈ ప్రాంతానికి రాణిని.'

'ఐతే నాకోసారి అతని శవం ఎక్కడుందో చూపించు.'

నర్మద ఈసారి ఇంకా బిగ్గరగా నవ్వింది. 'నీకు శవం కావాలా? దేనికి?'

'అతనెటువంటివాడైనా అతనిని నేను ప్రేమించాను. చివరి సారిగా అతని శవాన్ని చూడాలనుకుంటున్నాను.'

'నువ్వతన్ని ప్రేమించావా? పాపం. అతను నీమీదైనా అఘాయిత్యం తలపెట్టాడనుకున్నాను. అందుకే సంహరించాను. మొత్తానికి పొరపాటు జరిగింది. అతని శవాన్ని మా మనుషులు దహనం చెయ్యడానికి తీసుకుపోయారు. అది కూడా నీకు లభించడం దుర్లభం,' నర్మద అంది

మంథర కాసేపు మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా అంది. 'అతనివల్ల నేను సాధించాల్సిన పనులు అనేకం ఉన్నాయి.

అతను చనిపోయింతర్వాత నేను వాటిని చెయ్యగలగడం అసంభవం.'

'అలాగా. ఏమిటాపనులు ?'

'నర్మద అని ఒకామె ఉంది. నాకు ముఖ్య శత్రువులలో ఒకతె. చాలా బలవంతురాలు. ఆమెను సంహరించడానికి నేను ప్రయత్నిస్తున్నాను.'

నర్మద ఆశ్చర్యాన్ని నటిస్తూ అంది. 'నర్మద నీకు కూడా శత్రువేనన్నమాట. నాకూ శత్రువే. ఐతే ఇంకేం. మనిద్దరం కలిసి ఆమెమీద పగ తీర్చుకుందాం.'

మంథర మరింత ఆశ్చర్యపోతూ అంది. 'నర్మద నీకూ శత్రువేనన్నమాట!'

'ఔను.'

'ఐతే ఆమెను లొంగదీసుకోవడం ఎలాగో నువ్వే ప్రయత్నించు.'

'నేనెప్పుడూ ఆ ప్రయత్నంలోనే ఉన్నాను,' అంటూ నర్మద తాను కూర్చున్న రాతిమీద పెద్ద చప్పుడు చేసింది.

మరుక్షణంలో నర్మద వేషంలో ఉన్న నర్మద సహాయకురాలు చిన్నకత్తి నొకదానిని చేత్తో పట్టుకుని ఆ ఇద్దరి ముందుకి వచ్చి నిలబడింది. ఆమెను అకస్మాత్తుగా అక్కడ చూడగానే మంథర వణకిపోసాగింది. నర్మద కూడా భయాన్ని నటించింది.

'ఓహో, నాకు కావలసిన వాళ్లిద్దరూ ఇక్కడే ఉన్నారన్నమాట. సంతోషం. ఇద్దరిమీద నా పగ తీర్చుకుంటాను,' నర్మద వేషంలో ఉన్న ఆ యువతి కోపంగా అంది.

మంథర దగ్గర చిన్న కత్తికూడా లేదు ఎదురుతిరగడానికి. సమయానికి చిన్న ఆయుధాన్ని కూడా తన దగ్గర ఉంచుకో లేకపోయినందుకు ఆమె తనను తాను నిందించుకుంది.

నర్మద మాట్లాడకుండా ఆ యువతివైపు కంగారుగా చూస్తూ ఉంది. ఆ యువతి ఇద్దరివంక కళ్లురుముతూ కాసేపు చూసింది. తర్వాత నర్మద కనుసంజ్ఞ ప్రకారం మంథర దగ్గరకు వెళ్లింది. ఏదో మత్తుమందును ఉపయోగించి ఆమెకు స్పృహ తప్పేట్టు చేసింది. తర్వాత ఆమె కాళ్లు చేతులు తాళ్లతో గట్టిగా బంధించబడినాయి.

## 7

మంథరకు స్పృహ వచ్చేసరికి ఆమె అదే గుహాలో పడి ఉంది. కాళ్లు చేతులు తాళ్లతో గట్టిగా బంధింపబడి ఉన్నాయి. ఒళ్లంతా నొప్పులుగా ఉంది. పైగా ఒకప్రక్క ఆకలి శాగా దహించుకుపోతోంది.

మంథర నాలుగుప్రక్కలా ఓసారి చూసింది. గుహాలో చిమ్మచీకటిగా ఉంది. ప్రక్కనే కొంచెం దూరంలో మారు వేషంలో ఉన్న నర్మద ఆమెకు కనిపించింది. ఆమె కాళ్లు చేతులు కూడా బంధింపబడి ఉన్నట్టు మంథరకు అస్పష్టంగా కనిపించింది.

'చివరికి నర్మద మనిద్దరినీ బంధించి వెళ్ళిందన్నమాట,' మంథర హీనస్వరంలో అంది.

'ఔను. నాకు స్పృహ వచ్చేసరికి ఈ గుహలో బంధింప బడి ఉన్నాను. చివరికి మకిద్దరికీ ఇలాంటి పరిస్థితి సంభవిం చింది,' నర్మద దీనంగా అన్నది.

'ఇక్కడినించి మనం తప్పించుకునేదెలా?' మంథర అడి గింది.

'అదే నేనూ ఆలోచిస్తున్నాను. నేనెలాగో నా కట్లను బలాన్నంతా ఉపయోగించి త్రెంపుకుని బయటపడతాను. కాని నువ్వెలా తప్పించుకోగలవా అనే నేనాలోచిస్తున్నాను. ఈ గుహ చుట్టూ నర్మద మనుషులు కాపలా ఉన్నారు. నేనెలాగో వాళ్లను కూడా తప్పించుకుపారిపోగలను. కాని నువ్వు పారిపోవడం అసంభవం.'

'ఐతే ఏం చేద్దామంటావు?'

'నాకొకటే తోస్తోంది. మీ ఇల్లు ఎక్కడో చెప్పు. మీ అనుచరులలో ముఖ్యమైన వ్యక్తిపేరు కూడా చెబితే వాళ్లకు నువ్వు బంధింపబడిన సంగతి చెబుతాను. వాళ్లు వచ్చి నిన్ను విడిపించడానికి ప్రయత్నించవచ్చు.'

మంథర కాసేపు సంశయించింది. ఐనా ఆమె కూడా తనతోపాటే బంధింపబడి ఉండడంవల్ల అటువంటి అనుమానం ఉండడానికి అవకాశం లేకపోయింది. నెమ్మదిగా నర్మదతో అంది—

'పోనీ అలాగే చెయ్యి. మా ఇల్లు భవానీపురంలో ఉంది. శివాలయానికి ప్రక్కనే ఉన్న పెద్ద భవనం. ఆ ఊళ్ళో అంత కంటే పెద్ద మేడ మరొకటిలేదు. నువ్వు సునాయాసంగా దానిని కనుక్కోవచ్చు. అక్కడ నా ముఖ్యానుచరుడు కపాళి

అని ఒకతనున్నాడు. అతనిని నువ్వు కలుసుకుని ఈ సంగతంతా చెప్పవచ్చు.'

నర్మద కాసేపాలోచించింది. 'మరి అతను నా మాటలు నమ్మకపోతే ?' ఆమె అడిగింది.

'ఎందుకు నమ్మడు! నేను చెప్పాననని చెప్పు. నమ్ముతాడు.'

'నేనెవరైనా గూఢచారినని అతను భావించవచ్చుగా. ఎక్కడ చూసినా శత్రువుల గూఢచారులే తిరుగుతున్న ఈ రోజుల్లో అతను నామాట నిజమని నమ్ముతాడన్న నమ్మకం నాకు లేకుండా ఉంది.'

'ఐతే ఒక పనిచెయ్యి. మా రహస్యపదం ఒకటుంది. అతను ఆ రహస్యపదాన్ని గురించి అడిగితే 'మర' అని చెప్పు. కాని ఈ పదాన్ని మాత్రం మరెవరిదగ్గరా ఉచ్చరించకూడదు. చాలా రహస్యంగా ఉంచాలి. నువ్వు నాకు ఆప్తురాలివి కాబట్టి నీకీ రహస్యపదం చెప్పాను,' అన్నది చివరికి మంథర.

'ఆ సంగతి నాకు తెలియదా!' అన్నది ముభావంగా నర్మద.

తర్వాత కాసేపటివరకు నిశ్శబ్దంగా ఉంది. ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు. ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉన్నారు.

నర్మద కాళ్లు చేతులకు తాళ్లు నామమాత్రంగా కట్టి ఉన్నాయి. నర్మద ఒక్కసారి బలంగా గింజుకోవడంతో అవి వదులై క్రిందకు జారిపోయాయి. నర్మద వెంటనే లేచి నిలబడింది. మంథర దగ్గరకువచ్చి ఆయాసాన్ని నటిస్తూ ఓసారి గట్టిగా గాలి పీల్చింది.

మంథరకు నర్మద బంధనాలనుండి విముక్తి పొందగానే కొంత ధైర్యం కలిగింది. తానూ కొద్దిరోజుల్లోనే విముక్తి

పొందడానికి అవకాశం ఏర్పడింది. ఆనందంగా ఆమె నర్మద కేసి చూసింది.

'మా ఇంటికి వెళ్తావుకదూ?'

'తప్పకుండాను. అందుకు సందేహమా! ఎంత కష్టపడైనా సరే నీకు సహాయం చేసితీరతాను. ఆ తర్వాత మనిద్దరం కలిసి నర్మద సంగతేమిటో తేల్చుకుందాం.'

ఆ నిస్సహాయస్థితిలో కూడా మంథర ఆనందంగా నవ్వింది. 'నువ్వు జాగ్రత్తగా వెళ్లిరా,' అని మారువేషంలో ఉన్న నర్మదను హెచ్చరించింది.

నర్మద, మంథర దగ్గర సెలవు పుచ్చుకుని ఓసారి అటూ ఇటూ పరిశీలనగా చూసి గుహలోనించి బయటపడింది. కొంచెం దూరంగా ఒకచోట కూర్చుని ఉన్న యమదూత, తన సహాయకురాలివంక చూసి విజయసూచకంగా చిరునవ్వు నవ్వింది. వాళ్ళు కూడా అప్రయత్నంగానే నవ్వారు. నర్మద నెమ్మదిగా వాళ్లను సమీపించింది.

'నాకు కావలసిన విషయాలు నేను మంథర దగ్గరనుండి సేకరించాను. ఇక చెయ్యదల్చుకున్న పనిలో విలంబం అనవసరం,' అన్నది నర్మద. తిరిగి తన వేషంలో ఉన్న ఆ యువతికిలా ఆజ్ఞాపించింది. 'మంథరకు మళ్ళీ స్పృహ లేకుండాచేసి మన భవనంలోని తీసుకుపోయి బంధించు. తప్పించుకు పోకుండా బాగా కట్టుదిట్టం చెయ్యాలి. పడవనడిపేదారి నీకు చెప్పానుగా. ఇక కొన్నాళ్ళు నువ్వు నా వేషంలోనే అక్కడ ఉండడం మంచిది. నేను ఇదే వేషంలో కొన్ని పనులు సాధించాలి.'

ఆ యువతి మౌనంగా తల ఊపింది. నర్మద యమదూత వైపు తిరిగింది.

'ఇక మనం మీ కాగితాలను మంథర దగ్గరనుండి సంపాదించేపని చూడాలి. వెళ్దాం పదండి. మీ ఊరు భవానీపురమేగా. మంథర ఇంటికి వెళ్ళాలి. అక్కడిదాకా కలిసివెళ్దాం. ఆతర్వాత నేను చెయ్యాల్సిన పని నేను చేస్తాను. మీ పని మీరు చేద్దురుగాని,' అన్నది నర్మద.

అడవి మధ్యగా రెండు గుర్రాలు దౌడు తీయసాగాయి. నిశ్శబ్ద వాతావరణంలో ఆ జోడు గుర్రాలడెక్కల చప్పుడు తప్ప మరేమీ వినిపించడంలేదు. యమదూతగాని, నర్మదగాని ఎవరూ మాట్లాడడంలేదు. మౌనంగా స్వారీ చేస్తున్నారు.

అడవిదాటి చివరికి భవానీపురం వెళ్లేరోడ్డు చేరుకున్నారిద్దరూ. తిన్నగా ఉన్న రోడ్డుమీద రెండు గుర్రాలూ వేగంగా పరుగుతీస్తున్నాయి. రోడ్డుకిరుప్రక్కలా ఉన్న చెట్లు ప్రక్కలకు పెరిగి రోడ్డును పూర్తిగా కప్పివేస్తున్నాయి.

నర్మద తాను చెయ్యతల్చుకున్న పనిని గురించి, యమదూత చెయ్యవలసిన పనిని గురించి అతనితో ముందుగానే చెప్పింది. ఆ ప్రకారమే చెయ్యడానికి ఇద్దరూ నిశ్చయించుకున్నారు.

భవానీపురం చేరుకునేసరికి రాత్రి బాగా ప్రొద్దుపోయింది. దూరంగా ఓ ప్రక్కగా ఉన్న శివాలయగోపురం, ధ్వజస్తంభం ఊరుబయటకు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

'ఇదే భవానీపురం. మనం శివాలయం దగ్గరికి వెళ్ళాలి,' అన్నాడు యమదూత.

ఇద్దరూ గుర్రాలను నెమ్మదిగా నడిపించసాగారు. పుర మంతా సద్దుమణగింది. జనమంతా నిద్రపోతున్నారు. రాత్రి వేళ మసక వెల్తురు రోడ్లమీద ప్రసరిస్తోంది. యమదూత ముందు వెళ్తున్నాడు. నర్మద అతనిని అనుసరించి వెళ్తోంది.

చివరికి గుర్రాలొక మలుపు తిరిగాయి. ఆ రోడ్డుమీద దూరంగా మసక వెలుగులో యమదూతకొక ఆకారం అస్ప ష్టంగా కనిపించింది. ఆ వ్యక్తి నడచి వెళ్తున్నాడు. అతని భుజం మీద ఒక పెద్ద పెట్టె ఉంది.

గుర్రాలు ఆ వ్యక్తిని సమీపించాయి. అతను ముసుగు వేసు కుని ఉన్నాడు. ఆ పెట్టెను చూస్తే నర్మదకెందుకో అనుమానం కలిగింది. యమదూతవంక ఓసారి చూసింది.

యమదూత ఆ వ్యక్తి ఆకారంవంక పరిశీలించి చూశాడు. అతను కూడా గుర్రాలచప్పుడు విని వెనక్కి తిరిగి చూశాడు. అతను చూసేలోపునే యమదూత అతనిమీదకి దూకాడు. పై ముసుగుతీసి ముక్కుదగ్గర మత్తుమందు ఉంచాడు. మరు క్షణంలోనే ఆ వ్యక్తి స్పృహతప్పి నేల కూలిపోయాడు.

యమదూత ఆ వ్యక్తివంక చూసి నెమ్మదిగా అన్నాడు 'వీడు మంథర నౌకరు. నాకు బాగా తెలుసు.'

'పెట్టెలో ఏముందో?' నర్మద అనుమానంగా అన్నది.

పెట్టెకు గొళ్ళెంపెట్టి ఉంది తప్ప తాళం వేసిలేదు. యమ దూత ఆ పెట్టె మూత తెరిచాడు. ఇద్దరూ ఆతురతగా పెట్టె లోకి చూశారు. ఇద్దరికీ అంతులేని ఆశ్చర్యం కలిగింది.

'కాళి,' అన్నాడు యమదూత.

'ఔను. ఐతే ఈమెనిక్కడికి ఎవరు పంపించారో___'
అన్నది తిరిగి అనుమానంగా నర్మద.

'మంథర పంపించి ఉంటుంది. ఇంకెవరు పంపిస్తారు?'
అన్నాడు యమదూత.

'మంథర మనదగ్గరే బంధింపబడి ఉందిగా.'

'నన్ను కలుసుకోకముందే పంపించి ఉండవచ్చు.'

'ఐనా నాకేదో అనుమానంగానే ఉంది. మంథర ఇంట్లో మనకింకా అనేక రహస్యాలు దొరకవచ్చుననుకుంటా. మనకు కావలసినవాళ్ళు కూడా కొందరిక్కడ బంధింపబడి ఉండవచ్చు,' అన్నది నర్మద.

'అలా ఎందుకనుకుంటున్నారు?' యమదూత ఆశ్చర్యంగా నర్మదను ప్రశ్నించాడు.

'అలా అనుకోడానికి చాలా అవకాశాలున్నాయి. కాళిని మహారాణి అనుయాయులు బంధించారు. ఆమెతోపాటు జయంత్‌ను, నేపాళిని కూడా బంధించారు. కాళిని ఇక్కడకు పంపించారంటే వాళ్లను కూడా పంపి ఉండవచ్చునని నాకు అనుమానంగా ఉంది,' నర్మద సమాధానమిచ్చింది.

యమదూత మాట్లాడలేదు. ఆలోచిస్తూ ఊరుకున్నాడు.

'మంథర ఇల్లు ఇంకెంతదూరం ఉంది?' నర్మద అడిగింది.

'శివాలయం ప్రక్కగా అకనిపించే పెద్ద భవనమే,'
అన్నాడు యమదూత.

'సరే. అనుకున్నప్రకారం రేపు ఉదయం నేను ఆ ఇంటికి వెళ్ళి మాట్లాడతాను. ప్రస్తుతం మనం కాళికి స్పృహ తెప్పించాలి. ఆమె ద్వారా కొన్ని ముఖ్యవిషయాలు నేను తెలుసుకో

వలసి ఉంది. వెంటనే ఏదైనా రహస్యస్థలానికి ఈమెను తీసుకు వెళ్దాం,' అన్నది నర్మద.

'ఊరిబయట పాడుపడిన దేవాలయం ఒకటుంది. అక్కడికి తీసుకువెళ్దాం,' అన్నాడు యమదూత. స్పృహ కోల్పోయి ఉన్న కాళిని పెట్టెలోంచితీసి గుర్రంమీద తనముందు పడుకో బెట్టాడు. మరుక్షణంలో రెండు గుర్రాలు వెనక్కి తిరిగాయి.

# 8

అది పాడుపడిన చిన్న దేవాలయం. ఒకప్పుడాదేవాలయం పెద్ద పూజాగృహంగా ఉండేదేమో కాని ఇప్పుడెవరూ ఆ దేవాలయానికి వెళ్ళి పూజలు చెయ్యడంలేదు. పైగా ఆ దేవాలయంలో దయ్యాలు నివసిస్తున్నాయని కూడా ఒక వదంతి. అందుచేత అసలు ప్రజలు ఆ సమీపానికే రావడం మానేశారు. ఆ దేవాలయాన్ని గురించి అనేకరకమైన వదంతులు కథల రూపంలో భవానీపురంలో వ్యాపించాయి.

యమదూత, నర్మద గుర్రాలమీద ఆ దేవాలయం దగ్గరకు వచ్చారు. ఇద్దరూ గుర్రాలను దిగారు. యమదూత కాళిని తీసుకుని ముందు దేవాలయంలో ప్రవేశించాడు. నర్మద కూడా అతనివెనకే లోపలికి వెళ్ళింది.

లోపల బాగా చీకటిగా ఉంది. అది దేవాలయం అని తెలియనివాళ్లు చాలమంది దానిని ఏ కొండగుహో అని అనుకో వచ్చు కూడా. యమదూత తనదగ్గర ఉన్న ఒక కొవ్వొత్తిని తీసి వెలిగించాడు. దానిని దేవాలయంలో ఒక మూలగా ఉంచాడు.

నర్మద ఆ వెలుగులో లోపల ఉన్న విగ్రహంవంక చూసింది. అది మహాకాళి భయంకర విగ్రహం. ఆ విగ్రహాన్ని అకస్మాత్తుగా చూస్తే ఎవరైనా జడుసుకుంటారనడంలో సందేహంలేదు.

యమదూత, నర్మద నేలమీద కూర్చున్నారు. కాళిని మధ్యగా పడుకోబెట్టాడు యమదూత.

'ఈమెకు స్పృహ తెప్పించండి,' నర్మద అన్నది.

యమదూత కాసేపు సందేహించాడు. 'నేనే ఈమెకు స్పృహ తెప్పిస్తే అకస్మాత్తుగా నన్ను చూసి భయపడిపోతుంది. అందుచేత నేను దూరంగా ఉండడమే మంచిది. విగ్రహం వెనుకగా నేను విశ్రమిస్తాను. మీరే ఈమెకు స్పృహ తెప్పించి మాట్లాడండి,' అన్నాడు చివరికి.

అతని మాటలకు నర్మద నవ్వింది. సరేనని తల ఊపింది. యమదూత లేచివెళ్ళి విగ్రహం చాటుగా కూర్చున్నాడు. నర్మద స్పృహ కోల్పోయిన కాళివంక ఓసారి పరిశీలించి చూసింది. వెంటనే తనదగ్గర ఉన్న ఏదో మందును ఆమెకు వాసన చూపించింది.

కాళి కదిలింది. నెమ్మదిగా కళ్ళు తెరచింది. ఎదురుగా కని పించిన నర్మదవంక కాసేపు కళ్ళార్పకుండా చూసింది. తర్వాత లేచి కూర్చుంది. ఒకసారి దేవాలయం నాలుగుప్రక్కలా కలయచూసింది. చివరికి నర్మదవంక చూస్తూ ప్రశ్నించింది—

'మీరెవరు? నేనెక్కడున్నాను?'

నర్మద ఆ ప్రశ్నలువిని మందహాసం చేసింది.

'నేను నీకు శత్రువును కాదు. స్నేహితురాలినే. శత్రువుల చేతిలోనుండి విడిపించి తీసుకువచ్చాను. ఇప్పుడే స్పృహ తెప్పించాను. నువ్వు నన్నెరగకపోయినా నేను నిన్నెరుగుదును,' నర్మద అన్నది.

'ఇప్పుడు నేనెక్కడున్నట్టు!' కాళి కళ్ళు నులుముకుంటూ అడిగింది.

'భవానీపురం ప్రాంతంలో.'

'భవానీపురమా!' కాళి కళ్లు పెద్దవిచేసి ఆశ్చర్యంగా నర్మద వంక చూస్తూ అంది.

'ఔను,' నర్మద నవ్వుతూ సమాధానమిచ్చింది.

'మీ పేరు?'

'నర్మద.'

'మీ రెవరో తెలియచేస్తే సంతోషిస్తాను.'

'నేనెవరో తెలియచెయ్యడానికి నాకేమీ అభ్యంతరంలేదు. కాని ముందు నీ ద్వారా కొన్ని విషయాలు తెలుసుకోవాలని నేను కుతూహలపడుతున్నాను. నేను నీకు స్నేహితురాలినేనని చెప్పానుగా. మహారాజాదులు భూగృహం బయట ఉన్నప్పుడు దాని ముఖద్వారాన్ని రహస్యంగా తెరచింది నేనే. ఇంకా అనుమానంగా ఉందా. చెప్పు,' అన్నది నర్మద.

కాళి కాసేపు మౌనంగా నర్మదవంక చూసింది.

'ఎవరో కొత్తవాళ్లను చూసి అనుమానించడం సహజమేగా. మీరు నాకింకా కొన్ని విషయాలు వివరంగా చెబితే తప్ప నేను మిమ్మల్ని నమ్మలేను,' కాళి అంది.

'ఏం కావాలో అడుగు. చెబుతాను.'

'మీరెవరో వివరంగా చెప్పాలి.'

'సరే. విను. మహామాయను గురించి నువ్వు వినే ఉంటావు. అనేక విచిత్రగృహాలను కలిగి ఉండి వాటిని పరిపాలిస్తున్న మహారాణి. ఆమె నా అక్క.'

మధ్యలోనే కాళి ఆశ్చర్యంగా అంది. 'మహారాణి మీ అక్కా! నిజమా? ఐతే ఆమె మాకు శత్రువుగదా! మీరు స్నేహితురాలినంటున్నారు. ఇదెంతవరకు నిజమో నాకర్థం కాకుండా ఉంది.'

నర్మద నవ్వింది. 'ఆమె నా అక్క. ఐతే ఆమె మీకు శత్రువైనంత మాత్రాన నేనూ కావాలని ఎక్కడుంది. మా ఇద్దరికీ అభిప్రాయభేదాలు వచ్చి విడిపోయాం. నమ్మకమైన కొందరు భటులు, అనుచరులు నాతోపాటు వచ్చారు. చెరువు మధ్యగా ఉన్న ఒక రహస్యమందిరంలో నేను ఉంటున్నాను.'

ఈమాట వినగానే కాళి మరింత ఆశ్చర్యపోయింది. 'ఆ రహస్యమందిరం మీదా? అందులోనేకదూ ప్రతాప్ కొన్ని రోజులు ఉంది!'

'ఔను,' నర్మద సమాధానమిచ్చింది.

'ఐతే ఇప్పుడు మీమీద నాకు నమ్మకమేర్పడింది. నేపాళి మిమ్మల్ని గురించి నాకు చెప్పాడు. మీరు మా శ్రేయస్కాము లని విన్నాను. ధన్యవాదాలు. ఐతే నాకో విషయం మీరు చెప్పాలి.'

'అడుగు.'

'మీ అక్కకు మీకు శత్రుత్వం ఎందుకేర్పడింది?'

నర్మద నెమ్మదిగా సమాధానమిచ్చింది. 'శత్రుత్వమేమీ లేదు. అభిప్రాయభేదాలేర్పడినాయి. అంతే. ప్రతాప్, జయంత్‌లు బలవంతులైన రాకుమారులని మహారాణి విన్నది. వాళ్లు చిత్రగృహాల రహస్యాలన్నీ గ్రహించి వాటిని స్వాధీనం చేసుకుంటారని ఆమె భయం. అందుచేత వాళ్లను ఎలాగైనా మట్టుబెట్టి తానే ఈ చిత్రగృహాలను, రాజ్యాన్నంతటినీ ఏలాలని ఆమె అనుకుంది. అది నాకేమాత్రం ఇష్టంలేదు. రాజకుమారుల జోలికి వెళ్లడం అనవసరంగా నేను భావించాను. అక్కడే అభిప్రాయభేదాలేర్పడి మేం విడిపోయాం. చిత్రగృహాల, భూగృహాల రహస్యాలు ఆమెకెంత తెలుసో, నాకూ అంతే తెలుసు. అప్పటినుండి రాజకుమారులకు ఆమె హాని తలపెట్టింది. నేను వాళ్లకు సహాయం చేయదల్చుకున్నాను.'

'ప్రతాప్, కిరణ్మయి ఆ భూగృహంలోకి ఎలా వచ్చారు?' కాళి అడిగింది.

'ఆ భూగృహం మహారాణికి సంబంధించింది. ఆమె మంత్రిసాధు ప్రతాప్‌ను, కిరణ్మయిని, లావణ్యను ఆ భూగృహంలోకి చేర్పించాడు. మీరా భూగృహాన్ని ముట్టడించగానే ఆ సాధు దాని ముఖ్యద్వారాన్ని మూసివేశాడు. తర్వాత నేనా ముఖద్వారాన్ని తెరిచాను. కాని మీరు భూగృహం లోపలికి ప్రవేశించేసరికే మహారాణి అనుచరులు వాళ్లను సొరంగమార్గంగుండా ఎక్కడికో తీసుకుపోయారు. మిమ్మల్ని బంధించింది కూడా వాళ్లే.'

'మహారాజాదుల్ని కూడా వాళ్ళు బంధించారా?'

'లేదు.'

'ఐతే మహారాజుగారెక్కడున్నారు?'

'మంత్రిగారితోసహా స్వదేశానికి వెళ్ళారు.'

కాళి ఇంకేమీ అడగలేదు. అడగడానికి ఆమెకింకేమీ సందేహాలు మిగలలేదు. తన అనుమానాలనన్నిటినీ ఇప్పటికే తీర్చుకుంది.

'ఇక నీ ద్వారా కొన్ని విషయాలు నేను తెలుసుకోవలసి ఉంది. చెప్పడానికేమీ అభ్యంతరం లేదుకదూ,' నర్మద కాళిని అడిగింది.

'ఇంకా అభ్యంతరమా!' కాళి నవ్వుతూ అంది.

'ఐతే మహారాణి అనుచరులు నిన్ను బంధించింతర్వాత ఎక్కడికి తీసుకుపోయారు?'

'ఆ సొరంగంలోకి నేనూ జయంత్ ప్రవేశించాం. సొరంగం చివర ఉన్న గది తలుపులు తెరచి ఉన్నాయి. మేమిద్దరం దానిలో ప్రవేశించాం. అంతే, ఏదో ఘాటైనవాసన నా ముక్కును అదరగొట్టింది. నా కళ్ళు తిరగసాగాయి. తర్వాత ఏం జరిగిందీ నాకు తెలియదు. నేను స్పృహ కోల్పోయాననన్నమాట.' కాళి కొనసాగింది.

'ఆ తర్వాత నిన్నెక్కడికి తీసుకువెళ్ళారు వాళ్ళు?' నర్మద అడిగింది.

'తర్వాత నాకు స్పృహ వచ్చేసరికి నేనొక రాజసభలో ఉన్నాను. అంత అందమైన రాజసభను నేను మరెక్కడా చూడలేదంటే నమ్మండి. ఎక్కడ చూసినా బంగారమే, నగలే, వజ్రాలే.'

'అదే మహారాణిసభ. మధ్యనున్న రత్నఖచితసింహాసనం మీద ఉన్నదే మహామాయ. ఆమెకు కుడిప్రక్క భవాని, మా చెల్లెలు. ఓ ప్రక్కగా పద్మాసనంమీద కూర్చుని ఉండే సాధు మహారాణికి మంత్రి. అతనికి కూడా ఈ విచిత్రభవనాల రహస్యాలు తెలుసు.'

కాళి తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చెయ్యకుండా ఉండలేక పోయింది. ఆమె ఆశ్చర్యానికంతులేకపోయింది. ఒక్కనిమిషం మౌనంగా ఉన్న తర్వాత ఇలా అంది—

'అక్కడే నాతోపాటు జయంత్‌ను, సేఫాలిని కూడా చూశాను. కాని నాకు స్పృహవచ్చే సమయానికి ఆ ఇద్దరినీ వాళ్ల భటులు ఎక్కడికో తీసుకుపోతున్నారు. తర్వాత నేనొక్కదానినే ఆ సభలో మిగిలాను.'

'వాళ్ళు నిన్నేం చేశారు?' నర్మద ప్రశ్నించింది.

'మహారాణి సింహాసనం ప్రక్కగా కొంచెం వయస్సు మళ్లిన ఒకామె నిలబడి ఉంది. ఆమె నా దగ్గరకు వచ్చింది.'

'మంథర ఐ ఉండవచ్చు,' నర్మద అంది మధ్యలో. కాళి చెప్పుకుపోయింది.

'ఆమె నా దగ్గరకు వచ్చి ఒక కాగితం నాకిచ్చింది. దాని మీద సంతకం చెయ్యమంది. నేను చెయ్యనన్నాను.'

'ఆ కాగితంలో ఏం వ్రాసి ఉంది?' నర్మద అడిగింది.

'ఏమీ వ్రాసిలేదు. తెల్లకాగితమే. దానిమీద తర్వాత వాళ్ళు ఏం వ్రాయదల్చుకున్నారో తెలియదు.'

'తర్వాత—'

'నేను సంతకం చెయ్యననడంతో ఆమెకు పట్టరానంతకోపం వచ్చింది. నావంక ఎర్రబడిన కళ్లతో చూస్తూ సంతకం చెయ్యకపోతే కలిగే ఫలితం తెలుసా అన్నది. నేను ఆమె మాటల్ని లెక్క పెట్టకుండా తెలుసు అన్నాను ముభావంగా అంతటితో ఆమె ఆగ్రహం మిన్నుముట్టింది. మహారాణివంక తిరిగి,దీనిని మా ఇంటికి తీసుకువెళ్లడానికి అనుమతినివ్వండి. అక్కడ చూస్తాను దీనిసంగతి, అన్నది. మహారాణి సరేనన్నట్టు తల ఊపింది. అంతే. ఆ తర్వాత మళ్లీ నాకు స్పృహలేదు. ఏం జరిగిందీ నాకు తెలియదు. తెలివి వచ్చేసరికి ఇక్కడ మీ ముందున్నాను,' కాళి ముగించింది.

'అయితే సందేహంలేదు. ఆమె మంథర. ఆమెను నేను బంధించాను. ఇప్పుడు మా ఖైదులో ఉండి ఉంటుంది. ఆమె అనుచరుడొకతను నిన్ను ఆమె ఇంటికి తీసుకువెళుతుండగా నేను విడిపించి ఇక్కడికి తీసుకువచ్చాను. విశేషాలు తెలుసుకుందామని స్పృహ తెప్పించాను.' నర్మద అంది.

'ఇప్పుడు నాకు నన్ను గురించిన విచారమేంలేదు. కాని ప్రతాప్, కిరణ్మయి, జయంత్, లావణ్య, నేపాళి ఏమయ్యారో, ఎలాంటి బాధలనుభవిస్తున్నారో పాపం. వాళ్లను విడిపించగల శక్తి నాకు లేకపోయింది,' కాళి విచారంగా అంది.

'నువ్వు వాళ్లను గురించి విచారించకు. వాళ్లందరినీ విడిపించే పని నేను చూస్తాను. వాళ్లెటువంటి అపాయాన్నీ ఎదుర్కోవలసిన అవసరం ఉండదనుకుంటున్నా,' నర్మద అంది.

'మీరు సామాన్యులుకారని నేను గ్రహించాను. రాజకుమారుల్ని కాపాడవలసిన బాధ్యత మీమీద కూడా ఉంది.

మీరు కూడా ఈ విషయంలో మరింత శ్రద్ధ చూపిస్తున్నందుకు ఆనందంగా ఉంది. నేను వెంటనే బయలుదేరివెళ్లి నా ప్రయత్నంలో నేనుంటాను,' కాళి అంది.

'అలాగే కానీ. నేను నా కర్తవ్యాన్ని నిర్వహించడంలో వెనుకాడను. ముందు నువ్వు మహారాజుగారి దగ్గరకు వెళ్లి చితికిపోయిన ఆయన మనస్సుకు కొంత ధైర్యం చెప్పడం మంచిది,' నర్మద అన్నది.

కాళి సరేనన్నట్టుగా తల ఊపింది. అప్పటికి ఆ ఇద్దరి సంభాషణ ముగిసింది. మాట్లాడుకోవలసిన విషయాలన్నీ ఐపోయాయి. కాసేపటివరకు అక్కడ నిశ్శబ్దం ఆవరించింది. తర్వాత నర్మద కాళితో అంది—'నువ్వు యమదూతను ఎరుగుదువా?'

కాళి ఆశ్చర్యంగా నర్మదకేసి చూసి 'ఆయన ఎవరో నాకు తెలియదు. ఒక భయంకరమైన వ్యక్తిని నేను చిత్రగృహం దగ్గర చూశాను,' అన్నది.

ఆయనే యమదూత,' నర్మద అన్నది.

'ఆయనను మొదటిసారి చూసినప్పుడు నేను భయపడిపోయాను. కాని తర్వాత ఆయన మాకు చాలా సహాయం చెయ్యడంతో భయం తగ్గిపోయింది.'

'ఆయన మీకెట్టి అపకారమూ చేసే వ్యక్తికాదు. నువ్వాయనను గురించి భయపడాల్సిన అవసరంలేదు. పైగా ఆయన మీకేమాత్రమైనా సహాయం చెయ్యగలడు కూడా.'

'ఆ సంగతి నేను ముందుగానే గ్రహించాను,' కాళి అన్నది.

సరిగ్గా అదే సమయానికి విగ్రహం వెనుక విశ్రమిస్తున్న యమదూత లేచి వాళ్లదగ్గరకు వచ్చాడు. కాళి అకస్మాత్తుగా అతనినక్కడ చూసి ఆశ్చర్యపోయింది. నర్మద కాళివంక చూసి చిరునవ్వు నవ్వింది. యమదూత కూడా వాళ్లప్రక్కనే కూర్చున్నాడు.

## 9

తెల్లవారింది. భవానీపురంలో కోలాహలం చెలరేగింది. ప్రజలు ఎవరిపనుల్లో వాళ్లు మునిగిపోయారు. రాత్రంతా నిర్జీవంగా పడిఉన్న నగరానికి ప్రాణం వచ్చింది. వీధులు అలంకారాలతో అందంగా ఉన్నాయి.

నర్మద శివాలయం దగ్గరకువెళ్లి ఓసారి అటూ ఇటూ చూసింది. ఎడమప్రక్కగా ఉన్న ఎత్తయిన మేడ ఆమెను ఆకర్షించింది. ఆ భవనం చాలా పెద్దది. చుట్టూ విశాలమైన ప్రాంగణం ఉంది కూడా. ఎత్తయిన ప్రహరీగోడ ఆ భవనానికి కాపు కాస్తున్నది.

నర్మద ఆ భవనాన్ని సమీపించింది. ముఖద్వారం దగ్గరకు వెళ్లి నిలబడింది. గేటుదగ్గర నిలబడిన దర్బాను 'ఎవరికోసం?' అని,అడిగాడు నర్మదని.

'ఇది మంథర ఇల్లేనా?' ఆమె ప్రశ్నించింది.

'ఔను.'

'నేను అర్జెంటుగా కపాళిని కలుసుకోవాలి,'

దర్బాను గేటుతెరచి నర్మదను లోపలికి వెళ్లనిచ్చాడు. ఆమె తిన్నగా ముందుకు సాగింది. భవనద్వారాన్ని సమీపించింది.

అక్కడ నిలబడి ఉన్న ఒక భటుడు 'ఎవరు కావాలి ?' అని తిరిగి నర్మదను ప్రశ్నించాడు.

'కపాలిని కలుసుకోవాలి.'

'ఐతే ఇక్కడే కూర్చోండి. నేను వెళ్ళి ఆయనకు చెప్పి వస్తాను,' అన్నాడా భటుడు.

నర్మద అక్కడే నిలబడింది. భటుడు లోపలికి వెళ్ళాడు. ఆమె భవనం నాలుగువైపులా కలయ చూడసాగింది. ఇంతటి భవనాన్ని నిర్మించడం సామాన్యులకు సాధ్యం కానిపని. అని తనలో తాను అనుకుంది.

కాసేపటికి ఆ భటుడు తిరిగి వచ్చాడు. అతనితోపాటు మరో భటుడు కూడా వచ్చాడు.

'ఇతను మిమ్మల్ని ఆయన దగ్గరకు తీసుకువెళ్తాడు. వెళ్ళండి,' అన్నాడు ఆ భటుడు.

నర్మద వెనకవచ్చిన భటుడిని అనుసరించింది. విచిత్రంగా నిర్మింపబడిన ఆ భవనాన్ని పరీక్షగా చూస్తూ నర్మద ఆ భటుడి వెనకే నడవసాగింది. చివరికా ఇద్దరూ ఒక గదిని సమీపించారు.

'లోపలికి వెళ్ళండి,' అన్నాడు భటుడు.

నర్మద ఆ గదిలోపలికి ప్రవేశించింది.

లోపల ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతను నర్మద కోసమే ఎదురుచూస్తున్నట్టున్నాడు.

'కూర్చోండి,' అన్నాడావ్యక్తి నర్మద గదిలోకి రాగానే ఒక ఆసనం చూపిస్తూ. నర్మద కూర్చుంది. ఆమె దృష్టి ఒకసారి గది నాలుగువైపులా ప్రసరించింది.

'మీరేనా కపాళి ?' నర్మద అడిగింది.

'ఔను.'

'మీతో మాట్లాడాలి.'

'మాట్లాడండి. అభ్యంతరమేముంది ?'

'నేను మంథర దగ్గరనుండి వస్తున్నాను. ఆమె నన్నిక్కడికి పంపింది.'

'ఇప్పుడామె ఎక్కడుంది ?'

'నరేంద్రమహారాజుగారి ఖైదులో.'

కపాళి ఉలిక్కిపడ్డాడు. 'ఎక్కడ ?' అతను తిరిగి ప్రశ్నించాడు.

'నరేంద్రమహారాజుగారి బందిఖానాలో.'

'అదెలా సంభవించింది. ఆమెనెవరు బంధించగలిగారు ?'

'ఇదంతా కొంచెం సావధానంగా చెప్పవలసి ఉంటుంది.'

'చెప్పండి. వింటాను,' కపాళి ఆతురతగా అన్నాడు.

'మంథర యమదూతను కలుసుకోవడం సంభవించింది. ఆ ఇద్దరిమధ్య కొంతసేపు సంభాషణ జరిగింది. మంథరకు కోపం వచ్చి అతను అజాగ్రత్తగా ఉన్న సమయంలో అతనిని కత్తితో పొడిచి చంపింది.'

'మంథర యమదూతను చంపిందా!' కపాళి మధ్యలోనే ఆశ్చర్యంగా అన్నాడు.

'ఔను. ఇందులో ఆశ్చర్యమేముంది ? యమదూత ఆమె చెప్పినపని చెయ్యనన్నాడు. తన మాటను తిరస్కరించడంతో ఆమెకు పట్టరానికోపం వచ్చింది. అతనిని చంపివేసింది. అంతే.'

'తర్వాత—'

'కాని అదే సమయానికి మంత్రవాది ఆ ప్రక్కనే ఉన్న ఒక చెట్టుపైన ఉన్నాడు. అతని అనుచరులు కూడా కొందరా ప్రాంతంలో దాగి ఉన్నారు. యమదూతను మంథర చంపడంతోనే మంత్రవాది తన అనుచరులతో ఆమెనాక్రమించాడు. ఆమె ఖైదీ ఐంది.'

కపాలి ఆశ్చర్యంగా నోరు తెరచి వింటున్నాడు. నర్మద చెప్పుకుపోతోంది మామూలు ధోరణిలో.

'తర్వాత యమదూతను గురించి మంథర మంత్రవాదితో చెప్పింది. అతను మీకు శత్రువే, అతనిని సంహరించినందువల్ల మీకే లాభం. నన్ను వదలండి. నేను మీకేమీ హాని చెయ్యలేదు అంది. కాని మంత్రవాది ఆమె మాటలను నమ్మలేదు. యమదూత తమకు శత్రువనడానికి సరైన రుజువు చూపించమన్నాడు. మంథర నాలుగురోజులు గడువు అడిగింది. మంత్రవాది అందుకంగీకరించాడు. ఈ నాలుగు రోజుల్లో ఆమె ఎట్టి రుజువు చూపించకపోతే మంత్రవాది ఆమెను యమలోకానికి పంపుతాడనడంలో సందేహంలేదు.'

'ఇంతకీ ఆమె ఏమంది! మిమ్మల్ని ఎందుకు పంపింది?' కపాలి అడిగాడు.

'యమదూత తన జీవిత చరిత్రను వ్రాసుకున్న కాగితాలు ఈ ఇంట్లో ఉన్నాయట. అవి ఎక్కడున్నాయో మీకు తెలుసట. వాటిని తీసుకుని వెంటనే మిమ్మల్ని రాయమన్నానికి రమ్మంది. మీరు ఆలస్యం చేస్తే ఆమె ప్రాణాలకే అపాయం.'

కపాలి ఒక్క నిమిషం మౌనంగా ఆలోచించాడు. తర్వాత నర్మద మొఖంకేసి పరీక్షగా చూశాడు.

'ఇంతకీ మీరెవరో చెప్పారుకాదు.'

'నా పేరుతో మీకేం పనిలేదు. నరేంద్రమహారాజుకు నాకూ శత్రుత్వం ఉంది. నేనేదో పనిమీద తిరుగుతూంటే ఒకగదిలో మంథర కనిపించింది. కుతూహలంకొద్దీ నేనామె సంగతులు తెలుసుకున్నాను. చివరికి ఆమె నన్నిక్కడికి వెళ్లమని కోరింది. నేనందుకంగీకరించి వచ్చాను.'

'మీరు చెప్పిన విషయాలన్నీ నిజమని నేనెలా నమ్మగలను చెప్పండి,' కపాళి అనుమానంగా అన్నాడు.

'మీరు నమ్మినా నమ్మకపోయినా నాకేమీ నష్టంలేదు. ఇవి మీ మీ విషయాలు. నాకు సంబంధించినవి కావుగా. నేను చెయ్యాల్సిన పని చేశాను. చెప్పాల్సిన సంగతులు చెప్పాను. ఇక మీ ఇష్టం,' నవ్వుతూ నర్మద సమాధానమిచ్చింది.

'అది కాదు నేనడిగేది. మంథర మిమ్మల్ని పంపుతూ నాకు నమ్మకం కలగడం కోసం ఏదైనా గుర్తు చెప్పిందా అని,' కపాళి అన్నాడు.

'ఔను. నేనా సంగతి మర్చేపోయాను. కపాళి అడిగినట్టయితే 'మర' అని చెప్పమంది,' నర్మద అంది.

ఈమాట వినగానే కపాళి సంతోషంగా నవ్వాడు. అతని మొఖంలో సంతృప్తి కనిపించింది.

'ఇవ్వాళ మీరిక్కడ మాకు అతిథులుగా ఉండవలసిందిగా కోరుతున్నాను. మీరు నా కోరికను మన్నిస్తే ఎంతో ఆనందిస్తాను. తర్వాత, ఇప్పుడేదో చిన్న పనిమీద నేను బయటికి వెళ్లవలసిన అవసరం ఉంది కూడా. తిరిగి వచ్చేసరికి బాగా

ప్రొద్దుపోవచ్చు. రేపు ఉదయం మళ్లీ కలుసుకుందాం,' అన్నాడు కపాళి.

'నేను ఉండడానికి పెద్ద అభ్యంతరమేంలేదు. కాని ముందు మీరు మంథరను కాపాడే విషయం ఆలోచించవలసిందిగా కోరుతున్నాను.'

'నేనూ అదే పనిని గురించి ఆలోచిస్తున్నాను. ఇంకా ఆమెకు మూడురోజులు గడువుందిగా. రేపు ఉదయం బయలుదేరినా నేను రేపు రాత్రికి రాయదుర్గం చేరుకోగలను. మా గుర్రాలు బలమైనవే.'

'సరే,' అన్నది నర్మద.

'ఐతే మీ కోసం ఒక గది ఏర్పాటుచేయిస్తాను. స్వేచ్ఛగా మీరిక్కడ ఈరోజు గడపవచ్చు. మీ కేది కావలసినా చెయ్యడానికి మా సేవకులు సిద్ధంగా ఉంటారు.' కపాళి అన్నాడు.

'నాకు పెద్ద ఏమి అవసరం ఉంటుందిలెండి,' నర్మద అన్నది. అక్కడ ఉండి ఆ భవనాన్ని పరిశోధించే అవకాశం కలిగినందుకు ఆమెకెంతో ఆనందం కలిగింది.

కపాళి ఆ గదిలోంచి బయటికి వెళ్ళాడు. కాసేపట్లోనే అతని ఆజ్ఞ మీగడ నర్మదకు విశ్రమించడానికి తగిన ఏర్పాట్లన్నీ చేయబడ్డాయి. ప్రత్యేకంగా ఒక గది ఆమెకివ్వబడింది.

కపాళి ఆ గదిలోకి తిరిగి వచ్చాడు.

'మీకోసం గది ఏర్పాటు చేయబడింది. మీరక్కడ విశ్రాంతి తీసుకోండి. ప్రయాణం చేసి అలసిపోయి ఉన్నారేమో కూడా. మా సేవకులు తీసుకువచ్చే ఫలహారాలు స్వీకరించండి,' అన్నాడు కపాళి.

కపాలి ఆజ్ఞ ప్రకారం ఒక భటుడు నర్మదను ఆమెకోసం సిద్ధం చేయించబడిన గదిలోకి తీసుకువెళ్ళాడు. ఓసారి అటూ ఇటూ పరీక్షగా చూసి ఆమె గదిలో వాల్చి ఉన్న మంచం మీద కూర్చుంది.

తానింకా అక్కడ ఏం చెయ్యాలా అని నర్మద ఆలోచించ సాగింది. అంతలోనే ఒక దాసి ఫలహారాలు తీసుకువచ్చింది. క్రితం రాత్రి కూడా సరిగా ఆహారం లేదేమో నర్మదకు ఆకలిగా ఉంది. వెంటనే ఆ ఫలహారాలను స్వీకరించింది. దాసి వెళ్ళిపోగానే తలుపులు దగ్గరగా వేసుకుని మంచంమీద మేను వాల్చి ఆలోచించసాగింది.

## 10

చీకటిపడింది. ప్రొద్దుపోయింది. నర్మద భోజనంచేసి తన గదిలోకి వెళ్ళి పడుకుంది. అప్పటికింకా ఏదో పనిమీద బయటికి వెళ్ళిన కపాలి తిరిగి రాలేదు. ఆమె అతని కోసం ఎదురు చూడలేదు కూడా. తన గదిలోకి ఎవరూ రావద్దని సేవకులను ఆజ్ఞాపించి నర్మద గదిలోకి వెళ్ళిపోయింది. తలుపులన్నీ లోపలి ప్రక్క బంధించింది.

నర్మదకు ఏమీ తోచడంలేదు. పగలు కాసేపు నిద్రపోవడం వల్ల కాబోలు రాత్రి నిద్ర కూడా రావడంలేదు. ఒక మూలగా చిన్న నూనెదీపం మిణుకు మిణుకుమంటూ వెలుగుతోంది. ఆ గదికి కిటికీలుగాని, అల్మారాలుగాని ఏమీలేవు. గోడలకక్కడక్కడా చిన్న చిన్న కంతలు మాత్రం ఉన్నాయి. ఈ భవనాన్ని చూస్తుంటే నర్మదకు మహామాయ క్రొత్తగా నిర్మించిన

భవనాలు గుర్తుకు రాసాగినాయి. అవి కూడా సరిగ్గా ఇలాగే ఉన్నాయి. దీనిలో కూడా భూగృహంలాంటిదేమైనా ఉందేమో అనుకుంది నర్మద. ఉండడానికవకాశం ఉన్నట్టుగా ఆమె భావించింది.

బాగా ప్రొద్దుపోవడంతో భటులు, దాసీలు కూడా భోజనాలుచేసి పడుకున్నట్టున్నారు. బయట కూడా బాగా నిశ్శబ్దంగా ఉంది. ఎవరూ మాట్లాడుకుంటున్న చప్పుడు కాని, తిరుగుతున్న చప్పుడు కాని వినిపించడంలేదు. అప్పుడప్పుడూ సింహద్వారం దగ్గర కాపలా కాస్తున్నవాళ్ల మాటలు కాబోలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

నర్మద నెమ్మదిగా మంచంమీదినించి లేచింది. ఆమెకు ఇటువంటి భవనాలతో బాగా పరిచయం ఉంది. ఈ భవనాలలో రహస్యమార్గాలు ఎక్కడ ఏ రూపంలో ఉంటాయో ఆమెకు తెలుసు.

అడుగులో అడుగు వేసుకుంటూ ఆమె ఆ గది తలుపులను తెరచి బయటికి వచ్చింది. అక్కడ ఎవరూ లేరు. నిశ్శబ్దమే కాకుండా అక్కడ అంధకారం కూడా తన ప్రాబల్యాన్ని చూపిస్తోంది.

ఆ ప్రక్కగానే ఉన్న చిన్న గదిలోకి నర్మద ప్రవేశించింది. లోపల గడియవేసింది. ఆ గదికి ఒక ప్రక్కగా గోడమీద పొడుగాటి చీలిక ఉంది. అలాంటిదే మరో చీలిక గజం దూరంలో కనిపించింది. ఇది ఎక్కడికో దారి ఐ ఉంటుందని నర్మద గ్రహించింది. వెంటనే వేరుగా ఉన్న ఆ భాగాన్ని

నెట్టడానికి ప్రయత్నించింది. ఆ భాగం ప్రక్కకు కదిలింది. సరిగ్గా దానిక్రింద సొరంగం ఒకటుంది. దానికి మెట్లున్నాయి.

నర్మద ఒకసారి నాలుగు ప్రక్కలా చూసి ఆ మెట్లు దిగ నారంభించింది. మెట్లు ఒకచోట ఆగిపోయాయి. అక్కడ ఒక గది ఉంది. నర్మద నెమ్మదిగా ఆ గదిలోకి ప్రవేశించింది. కాని ఆమెకక్కడ ఏమీ కనిపించలేదు. ఆ గదిలోంచి మరో ప్రక్కకు తలుపులున్నాయి. నర్మద ఆ తలుపులను తెరచి అవతలి గదిలోకి ప్రవేశించింది.

నర్మద ఆశ్చర్యానికంతులేదు. ఆ గదిలో ఒక మూలగా ఒక దీపం వెలుగుతోంది. ఆ దీపపు కాంతిలో ఆమెకక్కడ చిన్న చిన్న కత్తుల దగ్గరినించి విచిత్రమైన ఆయుధాలెన్నో కనిపించాయి. ఒక నిమిషం అక్కడ ఆగి వాటికంక పరిశీలించి చూసి ముందుకు సాగింది. ఆ గది తలుపులను తెరచి అవతలి గదిలోకి అడుగుపెట్టింది. ఆ గదిలో మధ్యగా ఒక పెద్ద పెట్టె ఉంది.

నర్మద ఆశ్చర్యంగా ఆ పెట్టెకేసి చూసింది. దానికి తాళం వేసిలేదు. ఆమె దానికి దగ్గరగా వెళ్ళి కూర్చుంది. జాగ్రత్తగా మూత తెరిచింది. ఆమె కళ్లు ఆ పెట్టెలోపలికి తిరిగాయి. మరుక్షణంలో ఆమె మొఖాన నెత్తురుచుక్క లేదు. ఏదో బాధ ఆమె నరనరాలకు ప్రాకినట్టయింది. కంగారుగా ఆ పెట్టె మూత వేసేసింది.

నర్మద క్షణకాలంవరకు అక్కడినించి కదలలేకపోయింది. ఐనా ధైర్యం తెచ్చుకుని ఓసారి గది నాలుగు వైపులా చూసింది. ఆ గదిలోంచి ఇక మరోప్రక్కకు దారి ఏదీ ఆమెకు కనిపించలేదు. ఇక వెనక్కి వెళ్లవలసిందేనన్నమాట. ఆమె ఒకసారి

గది గోడలన్నీ తడిమిచూసింది. కాని రహస్యమార్గం కూడా ఏదీ ఉన్నట్టు ఆమెకు కనిపించలేదు.

గోడ పైభాగంలో ఒక చిన్న కిటికీలాంటిది నర్మదకంట పడింది. ఆ కిటికీగుండా అవతల ఏమున్నదో చూడాలనుకుందామె. పైకిగెంతి కిటికీ ఊచల్ని పట్టుకుంది. వాటి ఆధారంతో పైకి ప్రాకింది కిటికీలోంచి అవతలివైపు ఆతురతగా చూసింది.

అవతలిప్రక్క కూడా మరొక గది ఉంది. ఆ గదిమధ్యగా ఒక స్థంభం ఉంది. ఆ స్థంభం ప్రక్కనే కిరణ్మయి నేలమీద పడిఉంది. ఇదంతా నర్మదకు అస్పష్టంగా కనిపించింది. చివరికి కిరణ్మయి కూడా ఇక్కడే ఉందన్నమాట—ఆమె తనలో తాను అనుకుంది.

కిరణ్మయి ఉన్న ఆ గదిలోకి దారి ఎటునించి ఉందా అని నర్మద పరిశీలించి చూసింది. కాని ఆమెకు ఆ కిటికీలోంచి ఏమీ కనిపించలేదు.

కిటికీదగ్గరనుండి క్రిందకి దిగింది నర్మద. ఆ గదిలోంచి వెనక్కి నడిచింది. సొరంగమార్గం మొదట్లో ఉన్న గోడలోని భాగాన్ని యథాస్థానానికి నెట్టింది. కిరణ్మయి ఉన్న గదిలోకి దారి ఎటునించి ఉందా అని పరిశీలించి చూడసాగింది.

అకస్మాత్తుగా ఎవరో మాట్లాడుతూ భవనంలోకి వస్తున్న చప్పుడు నర్మదకు వినిపించింది. ఆమె తన గదిలోకి గబగబా వెళ్ళిపోయింది. మంచంమీద పడుకుంది. క్రీగన్నుగా తలుపుల వంక చూడనారంభించింది.

కాసేపటికి కపాలి ఆ గది ముందుకు వచ్చాడు. తలుపును కొద్దిగా నెట్టి లోపలికి చూశాడు. నర్మద నిద్రపోతూండడం చూసి సంతృప్తిగా మళ్ళీ తలుపు దగ్గరగా లాగాడు. మెల్లగా అడుగులు వేసుకుంటూ ఎటో వెళ్లిపోయాడు. ఇదంతా మెలు కువగా ఉండి నిద్రపోతున్నట్టు నటిస్తున్న నర్మద గమనిస్తూనే ఉంది.

కపాలి ఏం చెయ్యబోతున్నాడో అన్న అనుమానం కలి గింది నర్మదకి. నెమ్మదిగా మంచంమీదినించి లేచి తలుపుల దగ్గరకు వచ్చి ఒక రెక్క కొద్దిగా తెరచి బయటికి చూసింది. కాని ఆమెకెవరూ అక్కడ కనిపించలేదు.

నర్మద రెండడుగులు బయటికి వేసింది. ఒక గది చాటుగా కపాలి ఎక్కడికో వెళ్తూ కనిపించాడు. నర్మద అక్కడ కాసేపా గింది. తర్వాత నెమ్మదిగా కపాలి వెళ్ళినవైపుకు వెళ్ళింది. ఆ ప్రక్కగా క్రిందకి మెట్లున్నాయి. నర్మద కూడా ఆ మెట్ల మీదినించి క్రిందకి దిగింది.

మెట్ల క్రిందిభాగంలో ఒక గది ఉంది. ఆ గదిలో కాసేపు నిలబడి నర్మద కపాలి వెళ్లినవైపు చూసింది. రెండు గదులు దాటింతర్వాత కపాలి కిరణ్మయి ఉన్న గది చేరుకున్నాడు. నర్మద కూడా ఆ గదిదాకా వెళ్ళింది. బయటనే నిలబడి కపాలి ఏం చేస్తాడో అని ఆతురతగా చూస్తోంది.

స్పృహలేని స్థితిలో ఉన్న కిరణ్మయిని కపాలి స్పృహలోకి తీసుకువచ్చాడు. ఎదురుగా కపాలిని చూడగానే ఆమె కంపించి పోయింది. అసలే ఎడతెగని బాధలతో కృశించిపోతున్న కిర

ణ్మయి సరిగా నిద్రాహారాలు లేకపోవడంచేత మరీ నీరసించి పోయింది.

'ఏం? ఇకనైనా నీ పంతం మానతావా లేదా?' కపాలి కిరణ్మయిని అడిగాడు.

కిరణ్మయి సమాధానమివ్వలేదు. అసలతని ప్రశ్న వినిపించుకోనట్టుగా ఊరుకుంది.

కపాలి ఓసారి వికటంగా నవ్వాడు.

'ఇంకా ప్రతాప్‌వచ్చి నిన్ను కాపాడతాడనే నీ ఆశ! ప్రతాప్ ఎప్పుడో చచ్చిపోయాడు తెలుసా?' అతను కిరణ్మయి వంక చూస్తూ అన్నాడు.

ప్రతాప్ చనిపోయాడన్నమాట వినగానే కిరణ్మయి మనస్సు వికలమైపోయింది. గుండె ఆగిపోయినంత పనయింది. వెంటనే మళ్లీ స్పృహ కోల్పోయింది.

కపాలి మరొకసారి వికటంగా నవ్వి వెనక్కి తిరిగాడు. అతను వెనక్కి తిరగగానే నర్మద తిరుగుముఖం పట్టింది. గబగబా అన్ని గదులూ దాటి మెట్లెక్కి చివరికి తన గది చేరుకుంది. ఆ తర్వాత కాసేపటికిగాని కపాలి అడుగులచప్పుడు ఆమెకి వినిపించలేదు!

మరీ నీరసించిపోయిన కిరణ్మయిని గురించి నర్మద ఆలోచించసాగింది. శత్రువుల భవనంలో ఒంటరిగా ప్రవేశించి తానేమీ చెయ్యలేదు. సరైన ప్రయత్నం చేసికాని తాను కిరణ్మయిని, ఇతరులను విడిపించలేదు! ఆలోచిస్తూనే నర్మద నిద్రపోవడంవల్ల ఎప్పుడు తెల్లవారిందీ నర్మదకు తెలియలేదు.

తెల్లవారింతర్వాత కాసేపటికి కపాలి నర్మద గదిలోకి వచ్చాడు. గదిలో అడుగుల చప్పుడు కావడంతో ఆమెకు మెలుకువవచ్చి లేచి కూర్చుంది.

'రాత్రి సరిగా నిద్రపట్టలేదా?' కపాలి అడిగాడు.

'కొత్త స్థలం కావడంవల్ల కొంచెం ప్రొద్దుపోయేవరకు నిద్రపట్టలేదు,' నర్మద అంది.

'నేను రాయదుర్గానికి బయలుదేరుతున్నాను,' కపాలి అన్నాడు.

'వెంటనే బయలుదేరండి. ఆలస్యం చెయ్యడం శ్రేయస్కరం కాదు. నేనూ ఒకచోటికి వెళ్ళాల్సిన పని ఉంది. కాసేపట్లో బయలుదేరతాను,' అన్నది నర్మద.

'అంత తొందరలేదులెండి. ఫలహారాలు తీసుకున్న తర్వాత ఇద్దరం ఒకసారే బయలుదేరదాం. మీరు లేచి మీ పనులు చూసుకోండి,' అన్నాడు కపాలి.

క్రమంగా ఒకగంట గడిచింది. అప్పటికి రెండు గుర్రాలు సిద్ధం చేయబడినాయి. నర్మద, కపాలి ఆ గుర్రాలను ఆరోహించారు. ఉత్సాహంతో గుర్రాలు ముందుకు సాగాయి.

---

జయంత్, నేపాలి ఏమయ్యారు? నర్మద ఎక్కడికి బయలుదేరింది? యమదూత ఏం చేశాడు? తర్వాత ఏం జరిగింది? మొదలైనవిషయాలు మహామాయ ఏడవ పుస్తకం 'స్వర్ణగ్రంథం'లో చదవండి.

ఈ నెలలో సెలవులు ఎక్కువ కావడంవల్ల, పండగల హడావిడిలో ఏజెంట్లు డబ్బు పంపడం ఆలస్యం చేసినందువల్ల ఈ నవల ఆలస్యంగా వెలువడింది. ఈ విషయం ఏజెంట్లు గమనించవలసిందిగా మా ప్రార్థన—

మహామాయ-7

# స్వర్ణగ్రంథం

నవంబరు 15 వ తేదీన వెలువడుతుంది.

మహామాయ-8

# పాముకాటు

నవంబరు 30 వ తేదీన వెలువడుతుంది.

ఈ రెండు పుస్తకాలకు ఏజెంట్లు ఆయా తారీఖులలోపే డబ్బు పంపిస్తే పుస్తకాలు వెలువరించడంలో ఆలస్యం ఉండదు. రెండు పుస్తకాలకు ఒకేసారి డబ్బు పంపడం మంచిది. లేదా సమర్థులైన ఏజెంట్లు డిపాజిట్ కట్టి బిల్లులు చెల్లించవచ్చు.

విజ్ఞాన సాహితి
టినగర్ :: మద్రాసు-17

దీపావళికి విజ్ఞాన సాహితివారి మహత్తర ప్రచురణ

పాఠకుల హృదయాలకు శాశ్వతానుభూతిని చేకూర్చగల అత్యుత్తమ సాంఘిక నవల—

# ఎండమావులు

ముద్దులొలికే త్రివర్ణ ముఖచిత్రం—

వెనుక కవరుపై అందమైన ఏకవర్ణ చిత్రం—

దాదాపు 132 పేజీలతో-పాకెట్ సైజులో—

వెల రు 1-0-0

నవంబరు ఒకటవ తారీఖుకు ప్రతులు సిద్ధంగా ఉంటాయి. ఏజెంట్లు వెంటనే డబ్బు పంపండి. మహోమాయ ఏజెంట్లు ఈ పుస్తకానికి డబ్బు పంపకపోతే ఇతర ఏజెంట్లకు పుస్తకాలు పంపవలసి వస్తుంది. అందుచేత మహోమాయ ఏజెంట్లు తమకు కావలసిన ప్రతులకే తప్పక డబ్బు పంపవలసిందిగా కోరుతున్నాం.

విజ్ఞాన సాహితి
టినగర్ : : మద్రాసు-17

**VAJRAYUDHAM** Re. 0-8-0

—" ఈ నవలను పాఠకులకందించి ఎంతో ఆనందాన్ని వినోదాన్ని కలిగిస్తున్న శ్రీ కనకమేడల గారు అభినందనీయులు. వారిని తెలుగు పాఠకులు చిరకాలం జ్ఞాపకముంచుకుంటారనడంలో సందేహంలేదు."

—" నామట్టుకు నేను ఈ పుస్తకాలను చదివి ఎంతో ఆనందిస్తున్నాను. ఒక పుస్తకం పూర్తికాగానే తర్వాతి పుస్తకంకోసం ఎంతో ఆతురతతో ఎదురు చూడక తప్పడంలేదు."

మహామాయ - 6

# వజ్రాయుధం

—ఈ సీరియల్ నవలను గురించి అనేకమంది పాఠకులు తెలియచేసిన అభిప్రాయాలలో రెంటిని పైన ప్రచురించాం. వేలకొలది పాఠకులను ఆనందలోకాలలో విహరింప చేస్తున్న ఈ నవలను మీరూ చదివి ఆనందించండి.

**A VIGNANASAHITI Publication in Telugu**